RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY నిజం మా విజన్ 18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:68 THURSDAY,AUGUST 6,2026 PAGES:12 COST: 2/-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :68 గురువారం, ఆగష్టు 6, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పిన మెటా సీఈఓ జుకర్‌బర్గ్



### ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్టు తొలగింపు వ్యవహారంపై మెటా దిగొచ్చింది

తెలంగాణపత్రిక:ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ (CSAM), డీప్‌ఫేక్‌ల వ్యాప్తి, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన తప్పిదాలపై మెటా విచారం వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేసేందుకు భారీగా డబ్బులు తీసుకున్నట్లు మెటా బృందం అంగీకరించిందని కొన్ని వర్గాలు వివరాలు2లో




### విజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారు: ఉదయనిధి స్టాలిన్

ధర్మఘంట:తమిళనాడు ప్రతిపక్ష నేత, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ తన అరెస్టుపై మరోసారి విమర్శలు చేశారు. తన అరెస్టు పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో జరిగిందని, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ఇలా చేశారని ఆరోపించారు. వివరాలు2లో

### చంద్రుడిని ఢీకొన్న 4 టన్నుల బరువు ఉన్న స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం!



తెలంగాణపత్రిక:అంతరిక్షంలో ఓ కీలక ఘటన చోటుచేసుకు న్నట్లు తెలుస్తోంది. సుమారు 4 టన్నుల బరువున్న 'స్పేస్ఎక్స్' ఫాల్కన్-9 రాకెట్‌కు చెందిన పైభాగపు శకలం చంద్రుడిని ఢీకొన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీనివల్ల భూమికి ఎటువంటి ప్రమాదం లేనప్పటికీ, చంద్రుడి ఉపరితలంపై మాత్రం భారీ గుంత(Crater) ఏర్పడి ఉంటుందని నిపుణులు తెలిపారు. అమెరికా కాలమానం ప్రకారం గత ఏడాది జనవరిలో చంద్రుడిపైకి ల్యాండర్లను మోసుకెళ్లిన ఫాల్కన్-9 రాకెట్‌కు సంబంధించిన సెకండ్ స్టేజ్ శకలం నిర్దేశిత కక్ష్య నుంచి పక్కకు మిగతా2లో



### హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీతో బిగ్ స్కామ్ వెలుగులోకి వచ్చింది

నకిలీ ఎన్ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు 2

ఇంటర్ బోర్డు అనుమతుల కోసం దొంగ సంతకాలతో నకిలీ ఎన్ఓసీలు

## కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో రేవంత్ రెడ్డి భేటీ



ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్న రేవంత్ రెడ్డి

కీలక ప్రాజెక్టులకు పర్యావరణ క్లియరెన్స్ ఇవ్వాలని

కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ కు వినతి

తెలంగాణ పత్రిక : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉదయం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలుమిగతా2లో

## భక్తుల ఫిర్యాదులతో అర్చకుడికి నోటీసులు



కొండగట్టు ఆలయ వర్గాల్లో హాట్ టాపిక్

భక్తులతో వ్యవహార శైలిపై ఫిర్యాదులు..... 2

గత ఫిర్యాదులపైనా విచారణకు డిమాండ్

### సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా

హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు

సమ్మక్క సాగర్ నీళ్లను ఏపీకి ధారాదత్తం చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధపడిందన్న హరీశ్

దీనిపై రేవంత్ నోరు విప్పాలని డిమాండ్

తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపాటు



తెలంగాణపత్రిక: కర్ణాటకలో జరిగిన ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ అనంతరం సమ్మక్క-సారక్క (సమ్మక్క సాగర్) ప్రాజెక్టుకు చెందిన తెలంగాణ వాటా నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు దారాదత్తం చేసేం దుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధపడిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... తెలంగాణ ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించిందని ఆగ్రహం వ్యక్తం మిగతా2లో

### మణికొండలో ఉద్రిక్తత.. బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద ఆందోళన

తెలంగాణపత్రిక:మణికొండ బీఆర్ఎస్ మహిళా వింగ్ ప్రెసిడెంట్ పట్లోళ్ల రూపారెడ్డి ఇంటి వద్ద పలువురు బాధితులు ఆందోళన చేపట్టారు. చిన్నాచితక వ్యాపారుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేశారంటూ ఆరోపించారు. తిరుమల హిల్స్‌లోని రూపారెడ్డి నివాసానికి బాధితులు చేరుకున్నారు. 2



### ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు



తెలంగాణపత్రిక: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత2లో

## ఇంటర్ కాలేజీల ఫోర్జరీ కేసు

- ఫైర్ డీజీ సంతకాలు కూడా ఫోర్జరీ!
- హైడ్రా కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసిన 8 కాలేజీలు
- మాజీ ఫైర్ డీజీ నాగిరెడ్డి సంతకాలను కూడా ఫోర్జరీ చేసిన కాలేజీలు
- ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న నాగిరెడ్డి 2





### గంజాయి చాక్లెట్ల విక్రయం.. బిహార్‌కు చెందిన రంజిత్ కుమాం అరెస్ట్

తెలంగాణపత్రిక: దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దుండిగల్ తండా-2లో తనిఖీలు చేశారు. నిందితుడి 2లో

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నినాద్


# కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో రేవంత్ రెడ్డి భేటీ

ఈ ఉదయం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులకు తక్షణమే అటవీ, పర్యావరణ క్లియరెన్స్ ఇచ్చి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్న ఈ సమావేశం అనంతరం, సీఎం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. గోదావరి-కృష్ణా నదీ జలాల పంపిణీ, ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న జల వివాదాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించనున్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలతో భేటీ కానున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రివర్గ కూర్పును విజయవంతంగా కొలిక్కి తెచ్చిన హైకమాండ్, ఇప్పుడు తెలంగాణలో కూడా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణపై దృష్టి సారించింది. రాజీనామా బెదిరింపులకు వెనక్కి తగ్గకుండా కర్ణాటకలో ప్రయోగించిన 'కఠిన వైఖరి' ఫార్ములానే తెలంగాణలోనూ వర్తింపజేసి, మంత్రిపదవుల ఆశావహుల అసంతృప్తులకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈ భేటీ తర్వాత తెలంగాణ కేబినెట్ విస్తరణపై ఏఐసీసీ నుంచి కీలక ప్రకటన వెలువడే అవకాశాలు ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# చంద్రుడిని ఢీకొన్న 4 టన్నుల బరువు ఉన్న స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం!

సూర్య కిరణాలు (Solar activity), గురుత్వాకర్షణ శక్తి ప్రభావాల కారణంగా ఈ శకలం క్రమంగా తన మార్గాన్ని మార్చుకుని చంద్రుడిని సమీపించిందని స్పేస్‌ఎక్స్ వర్గాలు వెల్లడించాయి. ఇది గంటకు సుమారు 8,690 కిలోమీటర్ల (5,400 మైళ్ళు) వేగంతో చంద్రుడి ఉత్తర గోళార్ధంలోని ఐన్‌స్టీన్ క్రేటర్ సమీపంలో జాబిల్లిని ఢీకొన్నట్లు అంచనా వేశారు. ఈ అనూహ్య పరిణామంపై నాసా తో పాటు పలు అంతరిక్ష పరిశోధనా సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాయి. నాసాకు చెందిన 'ల్యూనార్ రికాన్సజెన్స్ ఆర్బిటర్' (LRO) ప్రోబ్, సౌత్ కొరియాకు చెందిన 'పాత్‌ఫైండర్' ఆర్బిటర్లు.. శకలం పడిన ప్రాంతాన్ని ఫొటోలు తీసేందుకు సన్నద్ధమయ్యాయి.
రాకెట్ శకలం చంద్రుడిని ఢీకొట్టిన కారణంగా ఏర్పడే ధూళి మేఘాలు, శిథిలాలను అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తులో జాబిల్లిపై మానవ నివాసాలు ఏర్పాటు చేసే ప్రణాళికలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం భూమి చుట్టూ సుమారు 17,000 టన్నుల బరువున్న 46,000లకు పైగా అంతరిక్ష వ్యర్థాలు తిరుగుతున్నట్లు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ESA) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యర్థాలు రోజురోజుకూ పెరిగిపోతే భవిష్యత్తులో పెను ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనప్పటికీ, ఈ ఘటన అంతరిక్ష ప్రయోగాల్లో వ్యర్థాల తొలగింపు, పర్యవేక్షణపై మరోసారి ఆలోచన రేకెత్తిస్తోంది.

# ఇంటర్ కాలేజీల ఫోర్జరీ కేసు.. ఫైర్ డీజీ సంతకాలు కూడా ఫోర్జరీ!

హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ కళాశాలల నకిలీ ఎన్ఓసీల స్కామ్‌లో మరో కొత్త నిజం వెలుగులోకి వచ్చింది. ఇంటర్ బోర్డు అఫిలియేషన్ పొందేందుకు 8 కాలేజీలు 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ సంత˘కాలను ఫోర్జరీ చేసిన ఉదంతం కలకలం రేపుతు ఒడగానే... మరోవైపు, సరిగ్గా అదే బాటలో మరికొ న్ని కాలేజీలు అగ్నిమాపక శాఖ మాజీ డీజీ నాగిరెడ్డి సంతకాలను కూడా ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న నాగిరెడ్డి స్థానంలో వేరే అధికారులు బాధ్యతలు (ఫైర్ డీజీ) చేపట్టినప్పటికీ... సదరు కాలేజీల యాజమాన్యాలు పాత డీజీ నాగిరెడ్డి పేరుతో నకిలీ ఫైర్ ఎన్ఓసీ పత్రాలను సృష్టించి ఇంటర్ బోర్డుకు సమర్పించా యి. నాగిరెడ్డి అగ్నిమాపక శాఖలో లేకపోయినా ఆయన సంతకాలతో సర్టిఫికెట్లు రావడంపై అను మానం వచ్చిన అధికారులు అసలు విషయాన్ని బయటకు తీశారు. దీనిపై విచారణ జరపగా, నాగిరెడ్డి పేరుతో ఫోర్జరీ సంతకాలు చేసి దొంగ ఎన్ఓసీలు తయారు చేసిన వ్యవహారం బయటప డింది. మొత్తం 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలు నాగిరెడ్డి పేరుతో ఈ నకిలీ ఎన్ఓసీల అక్రమానికి పాల్పడినట్లు అధికారులు తేల్చారు.

## సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా?:

# హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు

కర్ణాటకలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంల సమావేశం, తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం తర్వాత సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి మన రాష్ట్రానికి చెందిన 47 టీఎంసీల వాటాను ఏపీ కోసం వదులుకోవడానికి సిద్ధపడ్డారనే వార్తలు నెట్టింట వ్యాపిస్తున్నాయని... దీనిపై సీఎం రేవంత్ రెడ్డి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో సమ్మక్క సాగర్‌కు 47 టీఎంసీలు కేటాయించే ప్రసక్తే లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసినా, ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. తమ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సమ్మక్క సాగర్ 47 టీఎంసీల ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కేంద్ర అనుమతులు తీసుకొచ్చామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆఖరికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గానికి కూడా ఫలాలను అందించే ఈ నీటి కేటాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వదులుకుంటుందని ప్రశ్నించారు. చంద్రబాబు మళ్లీ తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారని, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునేలా కేంద్రానికి లేఖలు రాయడమే కాకుండా బోర్డు సమావేశాల్లో పాత అనుమతులను రద్దు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణకు నీటి విషయంలో అన్యాయం జరిగితే సహించేది లేదని, జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబును ఈ సందర్భంగా హెచ్చరించారు.

# భక్తుల ఫిర్యాదులతో అర్చకుడికి నోటీసులు

జగిత్యాల జిల్లా,(తెలంగాణ పత్రిక బ్యూరో)మల్యాల, ఆగస్టు 05.
ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో చోటుచేసుకున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.ఆలయంలో పనిచేస్తున్న ఓ అర్చకుడికి కార్యనిర్వహణాధికారి మెమో జారీ చేసినట్లు సమాచారం.

**భక్తుల ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు..!**

ఆలయ ప్రాంగణంలో అనుచిత వ్యాఖ్యలు చేయడం, భక్తులతో వ్యవహరించిన తీరుపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అర్చకుడికి మెమో ఇచ్చినట్లు తెలుస్తోంది. దర్శన ఏర్పాట్ల విషయంలో ఓ భక్తుడితో అర్చకుడు దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.దర్శనానికి వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేశారని, డబ్బులు ఇవ్వకపోవడంతో అక్షింతలు వేయకుండా పంపించారనే ఆరోపణలపై ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఈఓ పంపిన అటెండర్‌తో కూడా అనుచితంగా మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది.

**గత ఫిర్యాదులపైనా చర్చ...!**

గతంలో కూడా ఇదే అర్చకుడిపై భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు, అప్పటి ఈఓ హయాంలో పలు మెమోలు జారీ చేసినట్లు ఆలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అయితే తదుపరి చర్యలపై స్పష్టత లేకపోవడంతో భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.




ప్రస్తుతం జారీ చేసిన మెమో వ్యవహారంలో పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

**సిబ్బందిపై ఒత్తిడి ఆరోపణలు...?**

ఈ వ్యవహారం బయటకు రావడంపై ఆలయ కార్యాలయ సిబ్బందిపై అర్చకుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సమాచారం బయటకు ఎలా వెళ్లిందంటూ సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం.

**ఆలయ ప్రతిష్ట కాపాడాలని భక్తుల విజ్ఞప్తి..!**

భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఉన్న కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఇలాంటి వివాదాలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోందని భక్తులు అంటున్నారు. ఆలయ పరిపాలన పారదర్శకంగా సాగేందుకు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

# గంజాయి చాక్లెట్ల విక్రయం..

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దుండిగల్ తండా-2లో తనిఖీలు చేశారు. నిందితుడి దగ్గరి నుంచి 350 గ్రాముల 71 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాజీపల్లిలోని కంపెనీలో లేబర్‌గా పనిచేస్తూ దుండిగల్ తండా-2లో నిందితుడు రంజిత్ కుమార్ నివాసం ఉంటునట్లు పోలీసులు వెల్లడించారు. బిహార్‌లోని తన అత్తగారి ఊరి నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలిపారు. తండాలోని స్థానిక కార్మికులకు, లేబర్లకు గంజాయి చాక్లెట్లను అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీతో బిగ్ స్కామ్ వెలుగులోకి వచ్చింది.

తెలంగాణ పత్రిక ప్రతినిధి:
హైదరాబాద్ పరిధిలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్‌వోసీ సర్టిఫికెట్లను సృష్టించాయి. ఈ నకిలీ పత్రాలను సదరు కాలేజీల యాజమాన్యాలు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించి గుర్తింపు పొందేందుకు ప్రయత్నించగా అధికారుల తనిఖీల్లో ఈ మోసం బట్టబయలైంది. ఈ వ్యవహారంలో హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకు నకిలీ పత్రాలు సమర్పించిన 8 ప్రైవేట్ కళాశాలలపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్సార్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పుర ప్రాంతాలకు చెందిన కాలేజీలు ఈ స్కామ్‌లో ఉన్నట్లు గుర్తించారు. సుమారు 60 నుంచి 70కి పైగా కాలేజీలు సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీలపై కూడా అధికారుల నిఘా పెరిగిందని, విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పిన మెటా సీఈఓ జుకర్‌బర్గ్

కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేసేందుకు భారీగా డబ్బులు తీసుకున్నట్లు మెటా బృందం అంగీకరించిందని కొన్ని వర్గాలు తెలిపినట్లు పీటీఐ కథనం పేర్కొంది. ఈ వ్యవహారంపై మెటా క్షమాపణలు చెప్పడంతో పాటు తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా మెటా అంగీకరించినట్లు తెలుస్తోంది. కాగా.. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీని క్షమాపణలు చెప్పింది.

## విజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారు: ఉదయనిధి స్టాలిన్

త్రిషపై వ్యాఖ్యల నేపథ్యంలో ఉధయనిధిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించిన సంగతి తెలిసిందే. మంగళవారం హైడ్రామా తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ బుధవారం అసెంబ్లీకి హాజరయ్యారు. 'రాష్ట్రంలో కావేరి జల వివాదం, మేకేదాటు ప్రాజెక్టు, రైతుల సమస్యలు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ సమయంలో నా అరెస్టు పెద్ద రాజకీయ అంశంగా మారింది. ప్రజల దృష్టిని మళ్లించడమే ఈ చర్య వెనుక ఉన్న ఉద్దేశం' అని ఉదయనిధి ఆరోపించారు. తన అరెస్టుపై ముఖ్యమంత్రి మౌనం వహించడాన్ని ఉదయనిధి ఎద్దేవా చేశారు (DMK vs TVK). అలాగే 'నేను ద్వంద్వార్థాలు వాడానని కొందరు ఆరోపించారు. నేను ఒకే అర్థంతో మాట్లాడాను. రైతులకు నీరు కావాలి. దాని గురించే నేను మాట్లాడాను. మహిళలను అగౌరవపరిచే ఉద్దేశం నాకు ఎంతమాత్రం లేదు. తమిళనాడులోని ప్రతి తల్లిని, సోదరిని నేను నా సొంత కుటుంబంగా భావిస్తాను' అని ఉదయనిధి పేర్కొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు: సంపత్ కుమార్

రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

## మణికొండలో ఉద్రిక్తత.. బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద ఆందోళన

తిరుమల హిల్స్‌లోని రూపారెడ్డి నివాసానికి బాధితులు చేరుకున్నారు. నైన్ స్టార్ హిల్స్ వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దాచుకున్న జీవితకాల పొదుపు మొత్తాన్ని పెట్టుబడి పెట్టమంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు, సంవత్సరాలు గడిచినా ఒక్క రూపాయి కూడా ఎందుకు తిరిగి ఇవ్వలేదని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లబోమని బాధితులు స్పష్టం చేశారు. వందల సంఖ్యలో జనాలను రూపారెడ్డి నమ్మించి కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు. బాధితుల ఆందోళనతో మణికొండ తిరుమల హిల్స్ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# దమ్మపేట మండలంలో రూ.95 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

**దమ్మపేట, తెలంగాణ పత్రిక ఆగస్టు 5**

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.95 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో మౌలిక వసతులు, విద్య, చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్కారం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, గుత్తావారిగూడెంలో నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు. గుర్వాయిగూడెంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలకు నిర్మించిన ప్రహరీ



గోడను ప్రారంభించారు. అలాగే అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తంగిళ్ల విశ్వనాథ్ తల్లి రాములమ్మను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుంజా సుజాత నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొని శు



భాకాంక్షలు తెలిపారు. గండుగులపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కోనే నాగేశ్వరరావు 10వ వర్ధంతి ఘనంగా నిర్వహణ







**-వందలాది మందికి అన్నదానం**
**-నివాళులర్పించిన వైరా ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు రాందాస్ నాయక్**

**కొత్తగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ పత్రిక):**

కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో మాజీ మంత్రివర్యులు స్వర్గీయ కోనే నాగేశ్వరరావు 10వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం వారి తనయులు కోనేరు సత్యనారాయణ, కోనేరు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోనే నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైరా శాసనసభ్యులు కోనే నాగేశ్వరరావు ప్రజా సేవలను స్మరించుకున్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో నిమగ్నమైన కోనేరు సత్యనారాయణ, కోనేరు పూర్ణచంద్రరావుల సేవలను అభినందిస్తూ, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువై సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆందోని పాల్, అంబేద్కర్ సేవా సమితి నాయకులు మద్దెల శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొని కోనే నాగేశ్వరరావు సేవలను కొనియాడారు. వర్ధంతి సందర్భంగా రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది ప్రజలకు భోజనం వడ్డించారు. నాయకులు స్వయంగా అన్నదానం చేసి ప్రజలకు సేవలందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# నీలోజిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజల దాహార్తికి చెక్




**-సర్పంచ్ అనుముల భాస్కర్ చొరవతో 6వ వార్డుకు మిషన్ భగీరథ వాటర్ సప్లై**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి నీలోజిపల్లి గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివసిస్తున్న 6వ వార్డు ప్రజలు గత ఎన్నో సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ ఏర్పడి చాలా సంవత్సరాలు గడిచినప్పటికీ ఈ ప్రాంతానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ అందుబాటులో లేకపోవడంతో స్థానికులు ప్రతిరోజూ మంచినీటి కోసం అవస్థలు పడాల్సి వచ్చేది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి కోసం ఎదురు చూడడం, దూర ప్రాంతాల నుంచి నీటిని మోసుకురావడం, ప్రైవేట్ బోర్ వెల్స్, వాటర్ ట్యాంకర్లపై ఆధారపడడం వారి దైనందిన జీవితంలో భాగమైపోయింది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వేసవి కాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. మంచినీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి రావడం, అవసరానికి సరిపడా నీరు అందకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీటి సమస్య కారణంగా కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు ఆరోగ్యపరమైన సమస్యలు కూడా తలెత్తే పరిస్థితులు ఏర్పడ్డాయి. కాలనీవాసులు పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. అయితే గ్రామ నూతన సర్పంచ్ అనుముల భాస్కర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య ఆయన దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. సంబంధిత మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు కలిసి ప్రత్యేకంగా చర్చించి యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ ఎక్స్‌టెన్షన్ వర్క్స్ ప్రారంభించారు.పనులు వేగంగా పూర్తయ్యేలా స్వయంగా పర్యవేక్షించిన సర్పంచ్ అనుముల భాస్కర్, ప్రతి ఇంటికి డైరెక్ట్ మిషన్ భగీరథ వాటర్ కనెక్షన్ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 6వ వార్డులోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన డ్రింకింగ్ వాటర్ అందుతుండడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఇకపై నీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని, ప్రతి రోజు స్వచ్ఛమైన తాగునీరు ఇంటి వద్దకే అందుతుండటంతో తమ కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే నాయకత్వం సర్పంచ్ అనుముల భాస్కర్‌దేనని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రజలతో నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. గ్రామంలో రోడ్స్, డ్రైనేజ్, స్ట్రీట్ లైట్స్, సీసీ రోడ్స్, పారిశుద్ధ్యం, తాగునీటి వంటి అన్ని మౌలిక వసతుల అభివృద్ధికి సర్పంచ్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని ప్రతి వార్డు అభివృద్ధి చెందేలా సమాన దృష్టితో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్యం, నాణ్యమైన రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజ్ సౌకర్యాలు కల్పిస్తూ నీలోజిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.”పీపుల్ వెల్ఫేర్ ఈజ్ అవర్ ఫస్ట్ ప్రయారిటీ” అనే లక్ష్యంతో గ్రామాభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్న సర్పంచ్ అనుముల భాస్కర్ నాయకత్వంలో నీలోజిపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో మిషన్ భగీరథ తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని, ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిపోతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి 41 లక్షల 35 వేల చెక్కులు పంపిణీ



**జగిత్యాల, ఆగస్టు 5 (తెలంగాణ పత్రిక):**

జగిత్యాల అర్బన్ రూరల్ మండలాలకు చెందిన 100 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 41 లక్షల 35 వేల రూపాయల విలువ గల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డా: సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు జగిత్యాల మోతే రోడ్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతో నిరుపేదలకు న్యాయం జరుగుతుందని జగిత్యాలలో విద్య వైద్యానికి పెద్ద పీట వేస్తు సదుపాయాల విస్తరణకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం పాక్స్ చైర్మెన్ సందీప్ రావు నక్కల రవీందర్ సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీలోజిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవం కార్యక్రమం



**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం నీలోజిపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ ఆవుల లక్ష్మి, గ్రామ కార్యదర్శి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. పుట్టిన వెంటనే శిశువుకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని, తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు అందుతాయని వివరించారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి అనేక అంటువ్యాధులు, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు.గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల్లిపాలను ప్రోత్సహించడం ప్రతి కుటుంబం బాధ్యత అని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే తొలి అడుగని పేర్కొన్నారు.అంగన్‌వాడీ టీచర్ ఆవుల లక్ష్మి తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు తమ సందేహాలను నివృత్తి చేసుకోగా, శిశు ఆరోగ్యం కోసం తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బిజెపి నేతలకు శుభాకాంక్షలు వెల్లువ

**-రేణుక, కార్తీక్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు**

**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 5:**



బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పందుగ రేణుక, బీజేపీ నాయకుడు కార్తీక్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రభారి నందనం దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని రేణుక, కార్తీక్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి వారు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి, గరిగ శేఖర్, నాగరాజు, శివాజీ రాజా, ఝాన్సీ, నాగమణి, పద్మ ప్రసాద్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం చేసిన బీఆర్ఎస్ నాయకులు



మంగపేట,ఆగస్టు05:(తెలంగాణ పత్రిక)

ములుగు జిల్లా మంగపేట మండలం బుచ్చంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్ర వెంకన్న, ఎర్ర సైదులు వారి తల్లి ఎర్ర లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు జిల్లా నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య నేతృత్వంలో పార్టీ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎర్ర లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బూర్గుల వెంకటమల్లు, ప్రధాన కార్యదర్శి మండల ఉప్పలయ్య ఆధ్వర్యంలో పార్టీ తరఫున మృతురాలి కుటుంబానికి రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చిట్టిమల్ల సమ్మయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో బూర్గుల వెంకటమల్లు, మండల ఉప్పలయ్య, కొట్టె చెన్నయ్య, మండల రమేష్, అన్వర్ అలీ, నాగుల సతీష్, పగిడిపెల్లి సూరి, చీమల సమ్మయ్య, మద్దెల ఎల్లయ్య, కొత్తపల్లి సారయ్య, నాగుల యాకయ్య, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దామరచెరువు తూము షట్టర్ మరమ్మత్తుల నిర్లక్ష్యం పై బిఆర్ఎస్ నేతల మండిపాటు



కోటగిరి తెలంగాణ పత్రిక ఆగస్టు 5.

కోటగిరి మండల కేంద్రంలోని దామరచెరువు తూము షట్టర్ మరమ్మత్తుల నిర్లక్ష్యం పై బి ఆర్ ఎస్ పార్టీ నేతల మండిపాటు చెరువు తూమును రైతులతో కలిసి పరిశీలించి తక్షణమే తూమును పైకి లేపి మరమ్మతులు చేయాలని, నీటిని విడుదల చేయాలని పార్టీ మండల నాయకులు తెల్ల రవికుమార్ డిమాండ్ చేశారు. వర్షాకాలానికి ముందే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉన్న నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. అలాగే చెరువు కట్ట బలహీనంగా మారిందని పూర్తిస్థాయిలో నిండితే తెగిపోయే ప్రమాదం ఉందని తక్షణమే మొరం వేయించాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించకపోతే ఇరిగేషన్ శాఖ ఈ ఎన్ సి కు జిల్లా కలెక్టర్కు ఇరిగేషన్ ఎస్సి కి ఫిర్యాదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్ నజీర్ వడ్ల ఉమాకాంత్ ఆయకట్టు రైతులు వడ్ల శ్యాంసుందర్ గంగాధర్ భీమ్రావు రాములు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు రూ.26 వేలకు పెంచాలి: సీఐటీయూ డిమాండ్



తెలంగాణ పత్రిక దమ్మపేట ఆగస్టు 5

దమ్మపేట :- మధ్యాహ్న భోజన కార్మికులకు కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి, వారి వేతనాలను పెంచడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని సీఐటీయూ దమ్మపేట మండల కన్వీనర్ మురిహరి రఘు విమర్శించారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ.26,000కు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నెల 10న నిర్వహించనున్న "జైలు భరో" కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దఎత్తున పాల్గొంటారని తెలియజేస్తూ బుధవారం ఎంఈఓ జగపతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నప్పటికీ, వాటికి అనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆరోపించారు. దేశాన్ని ప్రజాప్రతినిధులు కాకుండా కార్పొరేట్ దిగ్గజాలు ప్రభావితం చేస్తున్న పరిస్థితి నెలకొందని పేర్కొంటూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బహుళజాతి కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను వెంటనే రూ.10,000కు పెంచాలని, గ్యాస్, కోడిగుడ్ల ఖర్చులను ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కవులూరి రామకృష్ణ, సత్యవతి, జయ, ఈశ్వరమ్మ, సుగుణ, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం







**-మరణించిన, వలస వెళ్లిన, నివాసం మార్చుకున్న ఓటర్ల వివరాల ధృవీకరణకు సహకరించాలి.**

**-జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 5

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీల సహకారం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, నివాసం మార్చుకున్న (షిఫ్ట్ అయిన) ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు పొడిగించడంతో అదనపు సమయం లభించిందని, ఆ సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని మిగిలిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన పురోగతిని వివరిస్తూ, మొత్తం 9,96,198 మంది ఓటర్లకు సంబంధించి 8,60,051 ఎన్యూమరేషన్ ఫారాలు (86.33 శాతం) డిజిటైజ్ కాగా, 1,29,263 ఫారాలు (12.98 శాతం) అన్-కలెక్టబుల్‌గా నమోదయ్యాయని తెలిపారు. దీంతో డిజిటైజ్ చేసిన ఫారాలు, అన్-కలెక్టబుల్ ఫారాలు కలిపి మొత్తం 9,89,314 ఫారాల ప్రక్రియ పూర్తై జిల్లా 99.31 శాతం పురోగతి సాధించిందన్నారు. ప్రస్తుతం కేవలం 6,884 ఫారాలు (0.69 శాతం) మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాపింగ్ పూర్తయిన ఓటర్ల వివరాలు నేరుగా ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటరు జాబితాలో చేరుతాయని తెలిపారు. అన్‌మ్యాప్డ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలో మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, నివాసాన్ని మార్చుకున్న ఓటర్ల వివరాలను ధృవీకరించి సంబంధిత ఆధారాలతో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏఎస్‌డీ, డీఎస్ఈ జాబితాలను మరోసారి పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగిందో లేదో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించాలని, అవసరమైతే రీ-వెరిఫికేషన్ నిర్వహించి లోపాలను సరిదిద్దేందుకు సహకరించాలని కోరారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, రీ-అరేంజ్‌మెంట్ ప్రక్రియను కూడా గడువులోగా పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. పాత, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలకు బదులుగా కొత్త భవనాలు అందుబాటులో ఉంటే వెంటనే సమాచారం అందించాలని, పాఠశాల పేరు లేదా భవనం మారిన సందర్భాల్లో సంబంధిత ప్రతిపాదనలు పంపాలని కోరారు. అలాగే 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు లేదా జనాభా మార్పులు అధికంగా ఉన్న ప్రాంతాలను రేషనలైజేషన్ కోసం ప్రతిపాదించాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సందర్శనలు నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తుండగా, ఆగస్టు 10లోగా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై విచారణ, పరిష్కార ప్రక్రియ చేపట్టి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేసి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్,కాంగ్రెస్ పార్టీ శ్రీనివాసరెడ్డి, బిజెపి అండ్ కృష్ణ, శివ, ఆమ్ ఆద్మీ పార్టీ రాంబాబు, సిపిఐ బాలరాజు ఇతర గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ విజయవంతానికి సీపీఐ ప్రచార యాత్రలు

**-సెప్టెంబర్ 1 సభకు ప్రజలు తరలిరావాలని జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పిలుపు**

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 5:



కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి 14 వరకు చేపట్టనున్న సీపీఐ ప్రచార యాత్రలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం షాపూర్‌నగర్ హమాలీ అడ్డా వద్ద ప్రచార యాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి కె. స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమామహేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, యువత, కార్మికులు, రైతులకు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక భారానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని, భారీగా అప్పులు చేయడమే కాకుండా పన్నుల రూపంలో ప్రజలపై అదనపు భారం మోపిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయకుండా ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రజా ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపడుతున్న ప్రచార యాత్రల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ నాయకులు సుంకిరెడ్డి మల్లేష్, మహేందర్, మజ్జి గౌరీ, పవన్, చంద్రయ్య, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రసన్న తల్లిపాలు వారోత్సవాలు



కోటగిరి తెలంగాణ పత్రిక ఆగస్టు 5.

కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్ లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సర్పంచ్ పుప్పల గంగారం హాజరై తల్లిపాల వారోత్సవాలు, అన్న ప్రసన్న కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు ఆయన చేతుల అన్న ప్రసన్న చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు మాట్లాడుతూ..... గర్భిణీ స్త్రీలు పౌష్టికమైన ఆహారాన్ని భూజించాలన్నారు. బాలింతలు చిన్నారులకు పాలు ఇచ్చే సమయంలో తల్లి రొమ్మును శు భ్రపరచుకొని ప్రశాంతమైన మనసుతో చిన్నారులకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. బాలింతలు పుట్టిన బిడ్డలకు ముర్రు పాలు ఇవ్వడంతో పిల్లలు ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడుతుందన్నారు. నవజాత శిశువులకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పుప్పాల గంగారం కార్యదర్శి జగదీష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఏఎన్ఎం ప్రమీల అంగన్వాడీ టీచర్లు సాయమ్మ విజయలక్ష్మి ఆశా వర్కర్లు పంచశీల రేఖ చిన్నారుల తల్లులు గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



# నర్మాల ఎగువ మానేరును సందర్శించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్







గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 5

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లోని నర్మాల ఎగువ మానేరు జలాశయాన్ని బుధవారం రోజున సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ సందర్శించి పరిస్థితులను పరిశీలించారు ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్ జిల్లా కార్యదర్శి గాండ్ల బాలలక్ష్మి గారు ఆయన వెంట పాల్గొన్నారు ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ నర్మాల ఎగువ మానేరులోకి సమృద్ధిగా నీరు చేరడం ఈ ప్రాంత రైతులకు శుభపరిణామమని జలాశయంలో నిల్వయ్యే నీరు రైతులకు సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు, ప్రజలకు తాగునీటి భద్రతను కూడా కల్పిస్తుందని పేర్కొన్నారు ప్రతి నీటి బొట్టును వృధా కాకుండా సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటి వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ప్రజలకు తాగునీటి భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించాలి

**-ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు : జిల్లా రవాణా అధికారి దేవునూరి శ్రీనివాస్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కలెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల విద్యానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో ట్రాఫిక్‌పై బాధ్యతాయుతమైన అవగాహన పెంపొందించి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి దేవునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు రహదారి భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు జరిగితే తల్లిదండ్రులు కూడా చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.రహదారిని దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్ వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు దాటే ముందు కుడి, ఎడమ వైపులు చూసి జాగ్రత్తగా వెళ్లాలని విద్యార్థులకు వివరించారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించకూడదని, అతివేగంగా వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు.అదేవిధంగా, రహదారిపై ప్రయాణించే సమయంలో అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ వంటి అత్యవసర సేవల వాహనాలకు వెంటనే దారి ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి పత్రాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.విద్యార్థులు తమ ఇళ్లలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులకు కూడా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ అంబాసిడర్‌గా మారి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జిల్లా రవాణా శాఖ సిబ్బంది, సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారి పృథ్వీరాజ్ వర్మ, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలు, రహదారి భద్రతా జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొని ట్రాఫిక్‌కు సంబంధించిన పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం ముగింపులో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి, ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటిస్తామని, ఇతరులతో కూడా పాటింపజేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

# విద్యార్థి దశ నుంచే సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పలుకుదాం





**-కలిసి సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దాం : జిల్లా ఎస్పీ మహేష్ బి. గిత్నే**

**-అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో భారీ సైబర్ అవగాహన ర్యాలీ**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక

విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాల పట్ల అప్రమత్తత పెంపొందించి, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా మారాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మహోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో విద్యార్థులు చేతుల్లో సైబర్ భద్రతకు సంబంధించిన ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని "అగు... ఆలోచించు... నిజం నిర్ధారించు... సైబర్ భద్రత పెంచు", "సైబర్ మోసాలకు నో చెప్పండి", "సురక్షిత డిజిటల్ వినియోగమే మన రక్షణ" వంటి నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ర్యాలీని చూసిన ప్రజలు కూడా ఆసక్తిగా వీక్షిస్తూ సైబర్ భద్రతపై అవగాహన పొందారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు, గృహిణులు, వృద్ధులు వంటి అన్ని వర్గాల ప్రజలు సైబర్ నేరాలకు గురవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికల ద్వారా వచ్చే పెట్టుబడి అవకాశాలు, ఉద్యోగాల పేరుతో వచ్చే సందేశాలు, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్ జాబ్స్, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్స్, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు వంటి వాటి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎలాంటి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్‌లు ఇతరులకు చెప్పవద్దని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని యాప్స్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులు, సందేశాలు, వీడియో కాల్స్, పెట్టుబడి ఆఫర్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఏదైనా సందేహాస్పద సమాచారం వచ్చినప్పుడు ముందుగా దాని నిజానిజాలను నిర్ధారించుకుని మాత్రమే స్పందించాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే సమయాన్ని వృథా చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా మొదటి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని, ఆ సమయంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు.జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాల్లో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని, ప్రజల్లో అవగాహన పెరిగితేనే సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, గ్రామ ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించి సైబర్ అంబాసిడర్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. "అప్రమత్తంగా ఉండండి... అవగాహన పెంచుకోండ సైబర్ సురక్షితంగా ఉండండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరించాలని, కలిసి సైబర్ సురక్షిత తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కోరారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, నాగరాజు, జునైద్, సైబర్ క్రైమ్ సిబ్బంది, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేత చందు ముదిరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**-శాలువాతో సత్కరించిన కొలన్ హన్మంత్ రెడ్డి**



తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 5:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పరిధిలోని సాయిబాబా నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చందు ముదిరాజ్ జన్మదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి చందు ముదిరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యసంపదలతో దీర్ఘాయుష్షు పొంది ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికిరణ్ పటేల్, డీసీసీ కమిటీ సభ్యుడు గోరికర్ కరణ్, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ గఫ్ఫార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింహా గౌడ్, రాజిరెడ్డి, రాంచందర్, నగేష్ రెడ్డి, అంజిరెడ్డి, రాజు చారి, హరి, యాసిన్, యూత్ కాంగ్రెస్ నాయకులు జానీ, అజ్జు, సన్నీ, శ్రీకాంత్, మాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారు, పోతురాజు వేషాలతో విద్యార్థినుల సందడి



ఇల్లంతకుంట, ఆగస్టు 5, తెలంగాణ పత్రిక

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కే జీ బీ వీ జూనియర్ కళాశాలలో బుధవారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థినులు అమ్మవారి, పోతురాజు వేషధారణలో అలరించారు. అమ్మవారి వేషంలో పయ్యావుల సాత్విక, బొజ్జ జయశ్రీ , పోతురాజు వేషంలో చిన్నారి నక్క రిషికా అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్, కళాశాల టీచింగ్ సిబ్బంది, నాన్-టీచింగ్ సిబ్బంది మరియు స్పెషల్ ఆఫీసర్ శిరీష , విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుడు బోడకుంట భూమయ్య నేత్రాలు సజీవం

ఓదెల ఆగస్టు 05 తెలంగాణ పత్రిక



తాను చనిపోతూ ఇద్దరు అందులకు సూపును ప్రసాదిoచిన మృతుడు బోడ కుంటి భూమయ్య ఓదెల గ్రామానికి చెందిన బోడకుంటి భూమయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుడి నేత్రాలను దానం చేశారు. మాజీఉప సర్పంచ్ తీర్థాల కుమార్ నేత్రదానంపై అవగాహన కల్పించగా మొదటి కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో, వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో కార్నియాలు సేకరించి హైద్రాబాద్ ఐ బ్యాంక్ కు పంపించారు ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన భార్య శంకరమ్మ, కుమారులు కోడండ్లు సుధాకర్ గౌతమి.,నవీన్ స్వప్న,. మనుమలు, మనుమరాళ్లు సాహిత్య, అక్షిత,ఋషిక్ వర్మ, అశ్విత్ లకు ఓదెల సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు భీష్మ చారి క్యాతం మల్లేశం, అల్లం సతీష్, సంతోష్, ఉప్పులపల్లి వెంకటేశ్వర్లు క్యాతం వెంకటేశ్వర్లు,మేరుగు సారంగం, కొండ్ర.వేణు.జీడి.నవీన్ నేత్రదాతకు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## బోనాల మహోత్సవానికి హాజరైన సర్పంచ్ సతీష్ కనికిరెడ్డి

ఓదెల ఆగస్టు 05 తెలంగాణ పత్రిక



ఓదెల మండల కేంద్రంలో తారకరామ కాలనీలో బుడిగ జంగాల కుల ఆరాధ్య దైవమైన పోచమ్మ మారమ్మ దేవతల బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓదెల సర్పంచ్ సతీష్ కని కిరెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా బుడగ జంగాల కులస్తులు డబ్బు సప్పులతో శివసతుల పూనకాలతో బోనాలతో బైలెల్లి పోచమ్మ మారమ్మ దేవతలను దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా సతీష్ కనికి రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో పుష్కలంగా వర్షాలు పడి పంటలు బాగా పండి అంత సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరిగిందని అదేవిధంగా బుడగ జంగాల కులాస్తులందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు సమ్మక్క రాజారాం కుల పెద్ద మనుషులు గురువప్ప సారయ్య చంద్రయ్య గంగారం రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వలస కార్మికుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సహాయం



శంకరపట్నం:ఆగస్టు05(తెలంగాణ పత్రిక)

శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఐదు రోజుల క్రితం బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ దంపతుల కుమారుడు రిత్విక్(8సం) గ్రామంలోని అల్లయ్య కుంటలో ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు.బతుకు దెరువు కోసం పొట్ట చేతిలో పట్టుకొని వలస వచ్చిన వారి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తల సహకారంతో సమీకరించిన రూ.10 వేల నగదును బుధవారం అందజేశారు.తీవ్ర దుఃఖంలో ఉన్న వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గాజుల మహేష్,గ్రామ శాఖ అధ్యక్షుడు నేరెళ్ల సంతోష్,వార్డు సభ్యులు చిట్ల శ్రీరాములు,దాసారపు రాజేందర్,పార్టీ ప్రధాన కార్యదర్శి మనోచారి,సీనియర్ నాయకులు తుమ్మ వెంకటపతి,రాయిని రమేష్,మోరే పోచయ్య,చీకట్ల శ్రీనివాస్,ఎండి సల్మాన్,గాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ కి గవర్నర్ సంయుక్త కార్యదర్శి సన్మానం

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 5



పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్‌ను తెలంగాణ గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె. శశికిరణాచారి లోక్ భవన్‌లో సత్కరించారు గవర్నర్‌తో జరిగిన సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్ లోని లోక్ భవన్‌కు వచ్చిన సందర్భంగా తన చాంబర్‌లో ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు వీరిద్దరూ కూడా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వారు రాష్ట్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తుండటం విశేషం ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం పాల్గొన్నారు.ఐ

## గూడాటిపల్లిలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

శంకరపట్నం తెలంగాణ పత్రిక ఆగస్టు 05



మండలంలోని గూడాటిపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టిన శిశువులకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూర్మ అనూష భాస్కర్, ఉపసర్పంచ్ వార్డు సభ్యులు అంగన్‌వాడీ టీచర్ ఆశా వర్కర్ మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆషాఢ మాసపు గోరింటాకు సంబరాలు

-గోరింటాకు ఔషధ గుణాలపై విద్యార్థినులకు అవగాహన.

జగిత్యాల పట్టణం, (తెలంగాణ పత్రిక),ఆగస్టు 5



జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో జాతీయ సేవా పథకం,ఆరోగ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసపు గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు కళాశాల ఆవరణలోని గోరింటాకు మొక్కల నుంచి ఆకులను సేకరించి,వాటిని సంప్రదాయ పద్ధతిలో నూరి తమ చేతులకు అలంకరించుకున్నారు. అనంతరం ఆరోగ్య సంఘం సమన్వయకర్త నీరజ గోరింటాకు ఔషధ గుణాల గురించి విద్యార్థినులకు వివరించారు.ముఖ్యంగా వర్షాకాలంలో గోరింటాకును చేతులకు పెట్టుకోవడం వల్ల వివిధ రకాల చర్మవ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బాధ్యతల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ప్రమోద్ కుమార్, ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చంద్రయ్య, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ సంగీతారాణి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సుజాత, ఆరోగ్య సంఘం సమన్వయకర్త నీరజ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పార్టీ



-జిల్లా నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి.

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 5

కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పార్టీ అని, సీఎం రేవంత్ రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నాడని జిల్లా నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. రైతు సంక్షేమం కోసం వర్షాలు పడాలని సీఎం రేవంత్ రెడ్డి, వరుణ యాగాలు నిర్వహించారని , అందులో భాగంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ లో కూడా వరుణ యాగం నిర్వహించారని అన్నారు. వర్ణయాగం నిర్వహించినప్పటి నుండి తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. ఎగువ మానేరు ఎప్పుడు నిండుతుంది అని ఎదురు చూసామని, ఈ వర్షాలకు ఎగువ మానేరు నిండుకుండలా మారిందని అన్నారు. ఈ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పరిపాలనకు ఇవాళ చరమగీతం పాడాలి, చరమగీతం పాడాలని చెప్పి అనేక రకాలైన పూజలు చేశారని పేపర్లలో చూస్తున్నాం, వాళ్ళు ఏం పూజలు చేసిర్రో మాకు తెలవదని,?కానీ, ఒకటి... ప్రజల దీవెనలు మాత్రం సి ఏం రేవంత్ రెడ్డి పైన, కాంగ్రెస్ పార్టీపైన ఉన్నదని వరుణుడు కరుణించి, వర్షాలు కురుస్తున్నాయని, ఇది కాంగ్రెస్ ప్రజా పరిపాలనకు, ప్రజా సంక్షేమ పాలనకు అండగా నిలబడ్డారని అనడానికి నిదర్శనం అని అన్నారు ?ఇంకొంతమంది పెద్దలు మాట్లాడుతున్నారు... ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కాళేశ్వరంలో భాగం కాదా అని, ఆ మాట్లాడుతున్న పెద్దలకు నేను ఒకటే చెప్తున్నా,ఎందుకంటే వాళ్ళు పెద్ద వయసులో ఉన్నవాళ్ళు, అనుభవజ్ఞులు, ఆ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఎప్పుడు కట్టిందో వాళ్ళందరికీ కూడా తెలుసు ఇవాళ,ఆ కాళేశ్వరం ప్రాజెక్టులో ఎల్లంపల్లిని అంతర్భాగం చేసినా, అది ఎల్లంపల్లి కట్టింది కాంగ్రెస్ హయాంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కట్టిందని అన్నారు కాళేశ్వరం కూలిపోయినా, సుందిళ్ళ బీటలు వారినప్పటికీ కూడా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా ఇవాళ మిడ్ మానేరు కూడా జలకళ నింపుకుంటుందని,27 టిఎంసిలకు గాను 15 టిఎంసిల నీళ్ళు గాయత్రి పంపు హౌస్, మూల వాగు ద్వారా, నిమ్మపల్లి వాగు ద్వారా అవి ఒక్కొక్క టిగా ఆ నీళ్ళు వస్తున్నా యని అన్నారు . రేపో, ఎల్లుండో ఇవాళ వరుణు డు కరుణించి అప్పర్ మానేరు డ్యామ్ దుంకగా నే, ఈ నీళ్ళు కూడా పోయి ఆ మిడ్ మానేరును కూడా జలకళతో నింపుతుందని అన్నారు వచ్చిన ప్రతి నీటిని కూడా ఒడిసి పట్టుకొని, ఎగువ మానేరు ప్రాంతం కింద ఉన్న చెరువులు, కుంటలను అన్నింటినీ కూడా నింపుకోవలి ని,రాబోయే కాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీటికి గానీ, సాగునీటికి గానీ ఇబ్బంది ఉండదని ఈ విషయంపై కలెక్టర్ తో కూడా మాట్లాడడం జరిగిందని అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాసంగి పంటలు పండాలని చెప్పి ఎప్పుడు కూడా మల్లన్న సాగర్ నుంచి ప్రతిసారి నీళ్ళు మనం ఎగువ మానేరు లోకి తీసుకుంటున్నా మని,. పోయినసారి కూడా 0.75 టిఎంసిల నీళ్ళను నింపుకు న్నామని, అంతకుముందు సంవత్సరం కూడా 0.75 టిఎంసిలను మనం మళ్ళీ మల్లన్న సాగర్ నుంచి తెచ్చుకున్నామని,అందుకే ఇవాళ నిలువ 0.75 టిఎంసి ఉన్నది కాబట్టే ఇవాళ ఈ ప్రాజెక్ట్ తొందరగా నిండిందని అన్నారు రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి నిబద్ధత ఉన్నదో మీరందరూ కూడా అర్థం చేసుకోవాలని అన్నారు . కేవలం మాయ మాటలు చెప్తూ ఈ ప్రాంతాన్ని ఎండబెట్టి, కేవలం రాజకీయ లబ్ధి పొందడానికే ఇవాళ , బిఆర్ఎస్ పార్టీ నీ,ఇక్కడ స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్ నేను ముఖ్యమంత్రి తరువాత ముఖ్యమంత్రిని, నేనే కాబోయే ముఖ్యమంత్రిని' అని చెప్పి ప్రగల్భాలు పలికాడని అన్నారు. ప్రజల మీద ధ్యాస లేదు, గెలిపించిన ప్రాంతం మీద ధ్యాస లేదు,తొమ్మిదవ ప్రాజెక్టును ఎక్కడ వేసిన గొంగళి అక్కడే పండబెట్టినాడనీ, 9వ ప్యాకేజీ పూర్తి చేసినట్లయితే ఇవాళ ఎగువ మానేరు జలకళతో ఎప్పుడో కలకలలాడేది, సింగసముద్రం పారేది, వీర్నపల్లి మండలం సస్యశ్యామలమయ్యేది,ఇవన్నీ కూడా పక్కన పెట్టి కేవలం గాలి మాటలు చెపుడే తప్ప చేసింది ఈ ప్రాంతానికి శూన్యం అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని వాళ్ళు ఎడాపెడా దొంగలు దొంగలుగా ఊళ్ళు పంచుకున్నట్టు ఉంచుకున్నారని , ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్ అతని భజన భక్తులు అందినకాడికి ఒకరు ల్యాండ్ మాఫియా, మరొకరు శాండ్ మాఫియా, ఎక్కడపడితే ఉన్నది ఉన్నకాడికి అమ్ముకున్నరని అన్నారు.?ఇప్పటికీ కూడా బీఆర్ఎస్ వాళ్ళు చేస్తున్నది ఏందంటే, ఎక్కడైనా నెగెటివ్ జరిగితే చిన్న చిన్న పొరపాట్లు, ప్రకృతి వైపరీత్యాల వల్లనో, కొంతమంది అధికారుల వల్లనో, ఇంకొన్ని పరిస్థితుల్లోనో ఏదైనా వైపరీత్యం జరిగితే దాని నుంచి లబ్ధి పొందాలనే ఒక కుటిల ఆశతోనే ఉన్నారు తప్ప,ప్రజలకు సేవ చేసి గానీ,



ప్రజల యొక్క మన్ననలను పొంది గానీ మేము మళ్ళీ అధికారంలోకి వస్తాం అని వారికి లేదు అన్నారు . కవిత ఒక్కొక్క ప్రశ్న వేస్తుంటే ఆ ప్రశ్నకు సమాధానాలు చెప్పలేక అయ్యో, అన్నా, బావా... ఇవాళ ఏ విధంగా తల్లడిల్లుతున్నారని ?దమ్ము, ధైర్యం... మీలో తెగువ, చీము, నెత్తురు, తెలంగాణ రక్తం మీలో పారినట్లయితే మీ చెల్లె కవిత అడిగిన ప్రతి ప్రశ్నకు కూడా సమాధానం చెప్పాలని అన్నారు. మీ కలలన్నీ కూడా కల్లలై పోయినాయని,వరుణుడు కరుణించిండు. కాంగ్రెస్ పార్టీ అంటే రైతులకు అండగా ఉంటది, రైతుల ఆశీస్సులు కాంగ్రెస్ పార్టీ పైన ఉంటాయి అని చెప్పి ఇవాళ దీని ద్వారా తేటతెల్లమైందని అన్నారు . మీరెన్ని కుయుక్తులు పన్నినా, ఎన్ని పూజలు చేసినా, ఎన్ని ప్రజా వ్యతిరేక పూజలు చేసినా ఇవాళ వరుణుడు మా పైన ఉన్నాడు, ప్రకృతి మా వైపు ఉన్నదని కేకే అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కొమిరిశెట్టి విజయ కాంగ్రెస్ నాయకులు పర్ష హన్మండ్లు కొమిరిశెట్టి తిరుపతి మాజీ మండల అధ్యక్షులు హమీద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# పలు గ్రామాలలో తల్లిపాల వారోత్సవం

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 05



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని మల్లారెడ్డిపేట సముద్ర లింగాపూర్ లక్ష్మీపూర్ దేశాయిపేట ముచ్చర్ల గ్రామాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామల సర్పంచ్ లు ఉపసర్పంచ్ లు వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామ కార్యదర్శులు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. పుట్టిన వెంటనే శిశువుకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని, తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు అందుతాయని వివరించారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి అనేక అంటువ్యాధులు, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు.గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల్లిపాలను ప్రోత్సహించడం ప్రతి కుటుంబం బాధ్యత అని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే తొలి అడుగని పేర్కొన్నారు తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు తమ సందేహాలను నివృత్తి చేసుకోగా, శిశు ఆరోగ్యం కోసం తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు





# దుండిగల్ సర్కిల్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటన



-బౌరంపేట్ అభివృద్ధికి ప్రణాళికలు..
-ప్రధాన రహదారులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 5:

బౌరంపేట్ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్‌లో బుధవారం అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు సీఆర్ఎంపీ ప్రధాన రహదారి దుస్థితి, భూగర్భ డ్రైనేజీ సమస్యలు, పెరుగుతున్న వాహనాల రద్దీ తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు, అంతర్గత రహదారుల నిర్మాణాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టి అభివృద్ధి చేస్తామని తెలిపారు. డీపీఎస్ స్కూల్--బౌద్రాయి మధ్య సీఆర్ఎంపీ ప్రధాన రహదారి భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న విషయాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఈఈ రత్నాకర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తూ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించే చర్యలు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకట మణికిరణ్, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ పాపమ్మ, ఏఈ సురేందర్ నాయక్, డీజీఎం ప్రమీలా, ఏఈ వెంకటేష్, విద్యుత్ శాఖ ఏఈ సాయికిరణ్, పోలీసు అధికారులు, ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాదాసు వెంకటేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, మురళీ యాదవ్, హనుమంతరావు, సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, సాయిరెడ్డి, మన్నె శేఖర్ ముదిరాజ్, సాంబశివరెడ్డి, బొబ్బ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ వసతి గృహాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

-కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన
-ఏఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేత
-డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు : ఏఐఎస్ఎఫ్ నేతలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక





అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న హాస్టల్ సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలపై స్పందిస్తూ, రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) రాంరెడ్డికి వినతిపత్రం సమర్పించి జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు అనేక సమస్యల మధ్య చదువులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, పోషకాహారం కొరవడిందని, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాంలు, దుప్పట్లు, పడకలు, ఇతర అవసరమైన సామగ్రి సకాలంలో అందడం లేదని తెలిపారు. ఈ కారణంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల సంక్షేమ వసతి గృహాల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడం, తాగునీటి కొరత, సరైన నీటి సరఫరా లేకపోవడం, విద్యుత్ అంతరాయాలు, ఫ్యాన్లు పనిచేయకపోవడం, పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడం వల్ల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని హాస్టళ్లలో కనీస భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని ఆరోపించారు. జిల్లాలోని పలు గురుకుల, సంక్షేమ హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, దీంతో విద్యార్థులకు సరైన వసతి, భద్రత కల్పించడం సాధ్యం కావడం లేదన్నారు. అన్ని సంక్షేమ వసతి గృహాలకు శాశ్వత సొంత భవనాలు నిర్మించి, తాగునీరు, మరుగుదొడ్లు, బాత్రూములు, విద్యుత్, చదువుకునే గదులు, వైద్య సదుపాయాలు, భద్రతతో కూడిన వసతి వంటి అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన హాస్టల్ సర్వేలో పలుచోట్ల వార్డెన్లు హాస్టళ్లలో అందుబాటులో లేకపోవడం, విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం, నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించిందని తెలిపారు. సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు క్రమం తప్పకుండా హాస్టళ్లను తనిఖీ చేసి, విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ప్రతి హాస్టల్‌లో నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వసతి, అవసరమైన విద్యా సామగ్రి, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక అధికారుల కమిటీతో సమగ్ర విచారణ నిర్వహించి, లోపాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే జిల్లావ్యాప్తంగా విద్యార్థులను ఐక్యం చేసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు పెండెల ఆదిత్య, గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక, కో-కన్వీనర్ బోధసు ప్రవళిక, నాయకులు భూక్యా సందీప్, శశి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# గాజులరామారంలో 'భావన డయా బెస్ట్ రైస్' కేంద్రం ప్రారంభం




-మధుమేహ నియంత్రణకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభిప్రాయం

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 5 :

125వ డివిజన్ గాజులరామారం పరిధిలోని మల్లారెడ్డి నగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన 'భావన డయా బెస్ట్ రైస్' కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి యాంత్రిక జీవనశైలిలో మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమతుల్య జీవనశైలితో పాటు ఇటువంటి ప్రత్యేక బియ్యం మధుమేహ నియంత్రణకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు చెబుతున్నారని, ప్రజలు వైద్యుల సూచనల మేరకు ఆహారాన్ని ఎంపిక చేసుకోవడం మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో భావన డయా బెస్ట్ రైస్ చైర్మన్ సుధీర్, నిర్వాహకులు ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్యాక్స్ చైర్మన్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, శశిధర్, మధు తదితరులు పాల్గొన్నారు.



## నవజాత శిశువులకు.. తల్లిపాలే అమృతం



రాయికల్ మండల ఆగస్టు 5(తెలంగాణ పత్రిక):

నవజాత శిశువులకు.. తల్లిపాలే అమృత తుల్యమైనవని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు. బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్వాడీ కేంద్రంలో 23 మంది గర్భిణీలు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు తల్లిపాల విశిష్టతపై వివరిస్తూ డబ్బా పాలు వద్దు.. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారమని అన్నారు. పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని తెలిపారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తల్లిపాలతో పాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందించి అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో చార్టర్డ్ ప్రెసిడెంట్ మోర హన్మాండ్లు, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారి సుధవేణి మురళి, క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, కొత్తపెల్లి రంజిత్, నిమ్మల వెంకట్ రెడ్డి, బొమ్మ కంటి నవీన్, ఆడెపు రాం ప్రసాద్, కుర్మ సుదర్శన్ రెడ్డి, పల్లికొండ గంగాధర్, వాసం రాజేందర్, పులి రమేష్, సత్యనారాయణ, అశోక్ సుధవేణి మురళి గౌడ్, అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి, అంగన్వాడి ఉపాధ్యాయురాలు సుజాత, పద్మ, వనిత, రమాదేవి, పుష్పలత, సుమలత, సిందూరి, రజిత, ఉమాదేవి, రాజేశ్వరి, రాధిక గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## బాయమ్మ పల్లి గ్రామంలో ఘనంగా తల్లిపాల వార్షికోత్సవం



ఓదెల ఆగస్టు 05 తెలంగాణ పత్రిక

ఓదెల మండలంలోని బాయమ్మపల్లి గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజు పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వార్షికోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించడం మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం బిడ్డకు శ్రేయస్కరమని అన్నారు మొదటి టీకా మరియు తల్లిపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంపొందించే మొట్టమొదటి రక్షణ కవచం అని పేర్కొన్నారు అలాంటి ముర్రుపాలు బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే మురుపాలు ఇన్ఫెక్షన్ నుండి కాపాడి జీర్ణ వ్యవస్థను పటిష్టం చేస్తాయని ఆరు నెలల నిబంధన శిశువుకు మొదటి ఆరు నెలల వరకు మీరు కూడా పట్టకుండా కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని అన్నారు దీనిద్వారా తల్లికి ఆరోగ్యం పాలు ఇవ్వడం వల్ల తల్లుల్లో రొమ్ము మరియు గర్భాశయ క్యాన్సర్ ముప్పు తగ్గుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి తో పాటు కార్యదర్శి అంగన్వాడి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామంలో ఘనంగా తల్లిపాల వార్షికోత్సవం

ఓదెల ఆగస్టు 05 తెలంగాణ పత్రిక



పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించడం శ్రేయస్కరమని మొదటి ఆరు నెలలు పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం బిడ్డకు ఆరోగ్యకరమని సర్పంచ్ పిట్టల రవికుమార్ ముదిరాజ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్య పల్లె గ్రామంలో బుధవారం తల్లిపాల వార్షికోత్సవం అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా బాలింతలకు పిల్లలకు గర్భిణులకు బ్రెడ్డు కోడిగుడ్లు తదితర వస్తువులు అందించారు ఈ కార్యక్రమంలో రవికుమార్ ముదిరాజ్ తో పాటు గ్రామ కార్యదర్శి అమూల్య వార్డ్ సభ్యులు తూడి అహల్య కందుల అనిత ఆశా వర్కర్ సరోజన సిఏ స్వప్న తో పాటు తదితరులు పాల్గొన్నారు

# సహాయ హస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**రాయికల్ మండల ఆగుస్టు 5 (తెలంగాణ పత్రిక):**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ధర్మాజీపేట గ్రామానికి చెందిన అమ్మానాన్నలను కోల్పోయిన అంగోతు శ్రావణి ఆరోగ్య పరిస్థితి బాగోలేదుతో వైద్యం ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నట్టు సమాచారం తెలుసుకున్న రాయికల్ పూర్వమిత్రులు 2002-2003 పదవ తరగతి మిత్రులు స్థాపించిన సహాయ హస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణికి కలిసి 10,000 పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

# గ్రామపంచాయతీ కార్మికుల క్రమబద్ధీకరణకు వినతి

-మిగిలిన 9 మందిని రెగ్యులరైజ్ చేయాలని మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కు విజ్ఞప్తి



**నంగునూరు, ఆగస్టు 5(తెలంగాణ పత్రిక):**
సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం నంగునూరు గ్రామపంచాయతీలో సుమారు 20 మంది కార్మికులు పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధుల పరిశుభ్రత తదితర ప్రజా సేవా కార్యక్రమాల్లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వీరిలో ఇప్పటికే 11 మంది కార్మికులు రెగ్యులరైజ్ కాగా, ఇంకా 9 మంది క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. మిగిలిన 9 మంది కార్మికులను కూడా తక్షణమే రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, అనంతరం గ్రామంలో అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా నలుగురిని నియమించాలని వినతిపత్రంలో కోరారు. గ్రామంలో మహిళా కార్మికుల సంఖ్య అధికంగా ఉండటంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర సేవల కోసం అదనపు సిబ్బంది అవసరం ఉందని వివరించారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, మిగిలిన కార్మికులకు న్యాయం చేయాలని, గ్రామాభివృద్ధికి అవసరమైన సిబ్బందిని నియమించాలని దేవులపల్లి యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు.

# నేటి నుంచి ఎరువుల కొనుగోలుకు కొత్త విధానం

-ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే విక్రయాలు
-నంగునూరు రైతులు ముందస్తుగా సిద్ధం కావాలి
-ఆధార్, ఫార్మర్ ఐడీ, మొబైల్ నంబర్ తప్పనిసరి
-నంగునూరు మండల వ్యవసాయ అధికారి బి.గీత

**నంగునూరు, ఆగస్టు 5(తెలంగాణ పత్రిక):**
కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎరువుల విక్రయ విధానంలో కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. ఆగస్టు 6 వ తేదీ నుంచి యూరియా, డీఏపీ, ఎన్పీకే కాంప్లెక్స్, ఎంఓపీ తదితర అన్ని రకాల ఎరువుల కొనుగోలు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే నిర్వహించనున్నట్లు నంగునూరు మండల వ్యవసాయ అధికారి బి.గీత తెలిపారు. ఈ కొత్త విధానం ప్రకారం రైతులు ఫార్మర్ ఐడీ లేదా ఆధార్ ఆధారంగా యాప్‌లో లాగిన్ కావాల్సి ఉంటుందన్నారు. ఫార్మర్ ఐడీ లేని వారు ఆధార్ ద్వారా నమోదు చేసుకోవచ్చు అని చెప్పారు. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తప్పనిసరిగా పనిచేసే స్థితిలో ఉండాలని తెలిపారు. ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తయిన తర్వాత భూమి, పంట, అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు తమకు అనుకూలమైన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో పాటు అవసరమైతే ఒకటి కంటే ఎక్కువ డీలర్లను కూడా ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. నమోదు పూర్తయిన తర్వాత రూపొందే క్యూ ఆర్ కోడ్ లేదా టోకెన్‌ను డీలర్‌కు చూపించి ఎరువులు పొందవచ్చని వివరించారు. రైతు స్వయంగా వెళ్లలేని పరిస్థితుల్లో ప్రతినిధిని యాప్‌లో నమోదు చేసి అతని ద్వారా కూడా ఎరువులు పొందే వెసులు బాటు కల్పించినట్లు తెలిపారు. బుధవారం రాత్రి నుంచి ప్రస్తుతం ఉపయోగిస్తున్న పాత యాప్ పని చేయదని తెలిపారు. కొత్త ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను ముందుగానే డౌన్ లోడ్ చేసుకొని అవసరమైన వివరాలను సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎరువుల కొనుగోలు సమయంలో ఆధార్, మొబైల్ ఫోన్, భూమి వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సమీప ఎరువుల విక్రయ కేంద్రం లేదా వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి నమోదు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.గీత విజ్ఞప్తి చేశారు.

# మల్యాల్ ఆల్ఫోర్స్‌లో ఘనంగా స్టూడెంట్ కౌన్సిల్ పదవీ స్వీకార కార్యక్రమం



-విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి
-ఆల్ఫోర్స్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక**
మల్యాల్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్టూడెంట్ కౌన్సిల్ పదవీ స్వీకార కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో నూతనంగా ఎన్నికైన విద్యార్థి ప్రతినిధులు తమ పదవులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అండ్ కాలేజీల ఛైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు ముఖ్య అతిథికి ఘన స్వాగతం పలికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఇటీవల జరిగిన విద్యార్థి నాయకత్వ ఎన్నికల్లో వివిధ హౌస్‌లు, విభాగాలకు ఎన్నికైన స్కూల్ ప్యూపిల్ లీడర్, వైస్ ప్యూపిల్ లీడర్, హౌస్ క్యాప్టెన్లు, వైస్ క్యాప్టెన్లు, స్పోర్ట్స్ క్యాప్టెన్లు, క్రమశిక్షణ కమిటీ సభ్యులు మరియు ఇతర విద్యార్థి ప్రతినిధులకు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి బ్యాడ్జీలు ప్రదానం చేసి పదవీ బాధ్యతలు స్వీకరింపజేశారు. అనంతరం వారు పాఠశాల అభివృద్ధి, క్రమశిక్షణ, సేవాభావం కోసం నిబద్ధతతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు, సమాజాన్ని ముందుకు నడిపించే నాయకులు అని అన్నారు. నాయకత్వం అనేది కేవలం ఒక పదవి కాదని, బాధ్యతతో కూడిన సేవ అని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు, సమయపాలన, క్రమశిక్షణ, సేవాభావం, నిజాయితీ, సహనం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వంటి విలువలను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి పెట్టాలని, ప్రతి అవకాశాన్ని నేర్చుకునే అవకాశంగా మలచుకోవాలని కోరారు. పాఠశాలలో అప్పగించే ప్రతి బాధ్యతను అంకితభావంతో నిర్వహించాలని, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విద్యార్థులు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాలలో క్రమశిక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. పోటీ ప్రపంచంలో విజయాన్ని సాధించాలంటే కష్టపడి చదవడంతో పాటు నాయకత్వ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, జట్టు భావన కూడా ఎంతో అవసరమని వివరించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యార్థులను కేవలం విద్యలోనే కాకుండా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వం, నైతిక విలువల్లోనూ ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులతో కలిసి పనిచేస్తామని, ప్రతి విద్యార్థి సమస్యను బాధ్యతగా తీసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమ పదవులను గౌరవంగా భావించి క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆదర్శ విద్యార్థులుగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌లు మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచన, సేవాభావం, సమన్వయ భావన పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థి తన ప్రతిభను వెలికితీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులను అభినందించారు. విద్యార్థుల ఉత్సాహం, క్రమశిక్షణ, ప్రతిజ్ఞ స్వీకారం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.




# గంభీరవుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 5**
జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో బుధవారం రోజున గంభీరవుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించడంతో పాటు స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రత్యేకంగా ఆరా తీశారు అనంతరం అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు డయల్ 100 స్థానంలో ఈరోజు నుంచి అమల్లోకి వచ్చిన డయల్ 112 అత్యవసర సేవలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అత్యవసర సమయంలో డయల్ 112ను వినియోగించేలా ప్రజల్లో చైతన్యం





కల్పించాలని సూచించారు ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు రాత్రి సమయాల్లో గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, పెట్రోలింగ్ చేసే సమయంలో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల, అనుమానిత వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు ఎస్పి వెంట సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

-ఏసీడీపీఓ హరిత
-ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణ

**నంగునూరు, ఆగస్టు 5(తెలంగాణ పత్రిక):**
తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి తొలి రక్షణ కవచమని ఏసీడీపీవో హరిత పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాకాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ హరిత ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిపాల ప్రాధాన్యతపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన మొదటి గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డకు అవసరమైన పోషకాలు అంది రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పుట్టిన గంటలోపు ముర్రు పాలను (కొలస్ట్రం) తప్పనిసరిగా శిశువుకు ఇవ్వాలని చెప్పారు. అవే బిడ్డకు తొలి టీకాల వంటివని వివరించారు. పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే





ఇవ్వాలని చెప్పారు. నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలలు పూర్తయిన తర్వాత అనుబంధ ఆహారాన్ని ప్రారంభించాలని చెప్పారు. రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తల్లిపాలను కొనసాగించడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగు పడుతుందని చెప్పారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ప్రతి నెలా చిన్నారులను అంగన్వాడీ కేంద్రానికి తీసుకువచ్చి బరువు తూకం వేయించాలని, ఎత్తు కలిపించుకోవాలని చెప్పారు. తద్వారా పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించ వచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆరు నెలలు పూర్తిచేసుకున్న చిన్నారులకు సంప్రదాయ బద్ధంగా అన్నప్రాసన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాకాల శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు రమాదేవి, ఏఎన్ఎం మంజుల, అంగన్వాడీ టీచర్లు పద్మ, వసంత, ఆశ కార్యకర్త స్వరూప, సీఆర్పీ శిరీష, ఉపసర్పంచ్ సామంతుల లాస్య, గ్రామ కార్యదర్శి గౌతమ్, గ్రామ తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల విద్యుత్ సమస్యలపై కిసాన్ మోర్చా ఆందోళన

**-నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి:**
**-విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం**

**సిద్ధిపేట/నంగునూరు, ఆగస్టు 5(తెలంగాణ పత్రిక):** సిద్ధిపేట జిల్లా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ రంగానికి వెన్నెముకైన రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉందని, ప్రస్తుతం అనేక గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. నిర్ణీత సమయాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు రాత్రింబవళ్లు మోటార్ స్టార్టర్ల వద్దే కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి వల్ల రైతుల శ్రమ, సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు అధిక లోడ్‌తో పనిచేస్తుండటంతో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న లూజ్ విద్యుత్ స్తంభాలు



రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రమాదకరంగా మారాయని, వర్షాకాలంలో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుందని పేర్కొంటూ వెంటనే వాటిని సరిచేయాలని కోరారు. అలాగే పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను సాధ్యమైనంత వరకు రహదారుల పక్కకు మార్చి, విద్యుత్ శాఖ నిర్వహణ సిబ్బంది, వాహనాలు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సీఎల్, జేఎల్ఎం, ఏఎల్ఎం సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసి రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికే రైతులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. లో వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతుండటంతో రైతులు వేలాది రూపాయల నష్టాన్ని చవిచూస్తున్నారని, తగిన వోల్టేజ్‌తో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను అత్యవసరంగా పరిశీలించి, జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసి వ్యవసాయానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కిసాన్ మోర్చా నాయకులు ఎస్ఈను కోరారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నాయకులు మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం వ్యవసాయాభివృద్ధికి కీలకమని, విద్యుత్ సమస్యలు కొనసాగితే రైతుల పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రైతులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తినేని రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నత్తి తిరుమల్ రెడ్డి, ఉపాధ్యక్షులు పరకాల తిరుపతిరెడ్డి, బీజేపీ నంగునూరు మండల్ అధ్యక్షులు చౌడుచర్ల వెంకటరామిరెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్కంటి ఏకొండ, పంగ నర్సింహారెడ్డి, సుతారి కార్తీక్ ముదిరాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జైల్ భరోలో పంచాయతీ కార్మికుల భాగస్వామ్యం

**-కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపునకు సంపూర్ణ మద్దతు**
**-కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాటం తప్పదని చిట్యాల కనకయ్య వెల్లడి**

**నంగునూరు ఆగస్టు 5(తెలంగాణ పత్రిక):** కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు పెద్దఎత్తున పాల్గొంటారని ఆ సంఘం జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక విధానాల కారణంగా కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్త కార్మిక నియమావళిని అమలు చేయడం వల్ల పని భారం పెరగడమే కాకుండా ఉద్యోగుల హక్కులు బలహీనపడే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మహాత్మాగాంధీ



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తీసుకొస్తున్న మార్పులు గ్రామీణ కార్మికుల ఉపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని, నూతన విద్యా విధానం ప్రభుత్వ విద్యను బలహీనపరిచి విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తోందని అన్నారు. విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న మార్పుల వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందని, రైతులు గిట్టుబాటు ధరలు, ఇతర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారంతో పాటు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందజేసినట్లు జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య తెలిపారు.

# నంగునూరు అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం సీతక్కకు వినతి

**-20 గ్రామాల అసంపూర్తి పనులు పూర్తి చేయాలని ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విజ్ఞప్తి**
**-కుల సంఘ భవనాలు, రోడ్లు, మురుగు కాలువలు, ఎస్సీ**
**-ఎస్టీ కాలనీల మౌలిక వసతులకు నిధులు కోరుతూ వినతి పత్రం**

**నంగునూరు,ఆగస్టు 5(తెలంగాణ పత్రిక):** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలోని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ దేవులపల్లి యాదగిరి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. బుధవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్లో మంత్రిని కలిశారు. మండలంలోని సుమారు 20 గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు నిధుల కొరతతో అసంపూర్తిగా ఉండిపోయాయని, వాటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల



ప్రకారం, గ్రామాల్లో కుల సంఘాల భవనాల నిర్మాణాలు పూర్తి కాకపోవడం వల్ల సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా మురుగు కాలువలు లేకపోవడం లేదా మధ్యలోనే నిలిచిపోవడంతో వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామీణ రహదారులు, లింక్ రోడ్లు పూర్తికాకపోవడంతో రవాణా సౌకర్యాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. కొన్ని గ్రామపంచాయతీ భవనాలు, కళ్యాణ మండపాలు కూడా అసంపూర్తిగా ఉండటంతో ప్రజలకు అవసరమైన సేవలు సక్రమంగా అందడం లేదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తాగునీటి ట్యాంకులు, బీటీ రోడ్లు వంటి మౌలిక వసతులు అత్యవసరంగా అవసరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలని కోరారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే నంగునూరు మండల గ్రామాల రూపురేఖలు మారడంతో పాటు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని దేవులపల్లి యాదగిరి అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వినతిపత్రంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పనులను చేపట్టాలని కూడా కోరినట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే నంగునూరు మండలంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమై గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని స్థానికులు భావిస్తున్నారు.

# జాతర ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు అధికారులు

**రామకృష్ణాపూర్ - తెలంగాణ పత్రిక**

రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 09న ఆదివారం రోజున నిర్వహించనున్న గాంధారి బోనాల జాతర ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. ప్రత్యేకంగా నేషనల్ హైవేపై వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు సమీక్ష నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలకు సూచనలు చేశారు. నేషనల్ హైవే అథారిటీ అధికారి సునీల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఇతర సదుపాయాలు కల్పించడం జరిగింది. భక్తులు పోలీసు



అధికారులు సూచించే ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ డివిజనల్ పోలీసు అధికారి కిరణ్ కుమార్, మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేశ్, కాసిపేట ఎస్ఐ అంజనేయులు, స్థానిక ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-అష్ట సర్పంచ్ రావుల లావణ్య - శ్రీనివాస్**

**ముధోల్:ఆగస్టు(05తెలంగాణ పత్రిక):** సీజనల్ సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అన్నారు. బుధవారం



మండలంలో ని అష్ట గ్రామపంచాయతీ కార్యాల యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వ హించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు.సర్పంచ్ మాట్లాడు తూ వర్షాకాలంలో పరిసరాల పరిశు భ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్ర తను పాటించాలని సూచిం చారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్ర త్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సావిత్రి కోటయ్య, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఏఎన్ఎం గంగామణి, ఆశ కార్యకర్తలు వాణి, లలితతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చీర్లవంచ గ్రామంలో అధిక రక్తపోటుపై అవగాహన కార్యక్రమం

**-30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్ష చేయించుకోవాలి : జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్**



**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక**

జిల్లా వైద్య ఉ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలోని చీర్లవంచ గ్రామంలో అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్)పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్లొమా ఇన్ హెల్త్ ప్రమోషన్ అండ్ ఎడ్యుకేషన్ శిక్షణార్థి సరోజన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు అధిక రక్తపోటు లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు, చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి వివరించారు.కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కిరణ్మయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్ల కారణంగా అధిక రక్తపోటు సమస్య ఎక్కువగా కనిపిస్తోందని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ మాట్లాడుతూ, అధిక రక్తపోటును "నిశ్శబ్ద హంతకుడు"గా పరిగణిస్తారని, చాలా మందికి ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే గుండె, మెదడు, మూత్రపిండాలు వంటి కీలక అవయవాలను దెబ్బతీసే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.అధిక ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయడం, శారీరక బరువును నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచవచ్చని వివరించారు. అలాగే ధూమపానం, మద్యపానం, ఒత్తిడికి దూరంగా ఉండడం కూడా ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు.డిప్లొమా ఇన్ హెల్త్ ప్రమోషన్ అండ్ ఎడ్యుకేషన్ శిక్షణార్థి సరోజన మాట్లాడుతూ, అధిక రక్తపోటు లక్షణాలు, కారణాలు, ప్రమాద కారకాలు, చికిత్స, మందులను క్రమం తప్పకుండా వాడాల్సిన అవసరం, వైద్యుల సూచనలు పాటించడం వంటి అంశాలపై గ్రామ ప్రజలకు సవివరంగా అవగాహన కల్పించారు. రక్తపోటును నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండాల వ్యాధులు వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు ఆరోగ్యానికి సంబంధించిన పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తూ క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ శేఖర్, గ్రామ కార్యదర్శి నీరజ, సూపర్‌వైజర్ కవిత, డీడీఎం కార్తీక్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

– ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్

ముధోల్,ఆగస్టు05 (తెలంగాణ పత్రిక)



సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యా ర్థులకు సైబర్ నేరాలపై అప్రమ త్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లా డుతూ గుర్తు తెలియని ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ ఇవ్వకూడదన్నారు.సోషల్ మీడి యాను బాధ్యతా యుతంగా విని యోగించాలని, వ్యక్తిగత సమాచా రం అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.ఆన్‌లైన్ గేమింగ్, ఫేక్ వెబ్‌సైట్లు, నకిలీ ఉద్యోగాలు, లాట రీల పేరుతో జరిగే మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండా లని చెప్పారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే పోలీసులకు సంప్రదించా లని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ ఫరత్ బేగం,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

-ఎగువ మా ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితె



గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు -05



ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం, ఎగువ నుంచి వరద తదితర అంశాలపై జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి ప్రస్తుతం కూడవెల్లి, పాల్వంచ వాగుల నుంచి ఇన్ ఫ్లో లేదని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 1. 6 టీఎంసీల నీరు ఉందని నీటి పారుదల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి వరద చేరి పూర్తి స్థాయి నీరు నిండే అవకాశం ఉందని, నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి మట్టాన్ని పరిశీలిస్తూ ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలని ఆదేశించారు ప్రాజెక్ట్ మత్తడి పారితే పోలీస్, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి.. రాకపోకలను నియంత్రిం చాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, ప్రశాంత్, తహసీల్దార్ మారుతి, సర్పంచ్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన అష్ట సర్పంచ్

-గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

ముధోల్:ఆగస్టు05(తెలంగాణ పత్రిక)



నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య-శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్ పట్టణంలోని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముధోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.గ్రామాల అభి వృద్ధికి సంబంధించిన పలు అంశా లను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రాన్ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల గంగారెడ్డి, జాదవ్ విశ్వనాథ్ లు ఉన్నారు.

# విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-సురక్ష తిరంగా కార్యక్రమంలో భాగంగా బోయినపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సైబర్ అవగాహన కార్యక్రమం

-సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ ఎన్. రమాకాంత

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక







తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్ష తిరంగా -- సైబర్ సురక్షిత తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా బుధవారం బోయినపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (జడ్పీహెచ్ఎస్) విద్యార్థులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి ఎస్ఐ ఎన్. రమాకాంత్ పాల్గొని విద్యార్థులకు డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ మోసాల నివారణ, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్. రమాకాంత్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత సోషల్ మీడియా వినియోగంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆన్‌లైన్‌లో వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్లు, బహుమతులు, ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడి ప్రతిపాదనలు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను నమ్మి వ్యక్తిగత వివరాలను ఇవ్వకూడదని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్లు, ఓటీపీలు, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లు వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులు, లింకులు, వీడియో కాల్స్, సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. ఎలాంటి సమాచారం వచ్చినా ముందుగా దాని నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే స్పందించాలని విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలకు గురైనట్లయితే సమయాన్ని వృథా చేయకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.విద్యార్థులు తాము నేర్చుకున్న సైబర్ భద్రతా సూచనలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలకు కూడా తెలియజేసి సమాజంలో అవగాహన పెంచాలని కోరారు. సురక్షితమైన డిజిటల్ వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు సైబర్ భద్రతకు సంబంధించిన పలు సందేహాలను ఎస్ఐని అడిగి నివృత్తి చేసుకున్నారు.

# ఎగువ మానేరు జలాలను సద్వినియోగం చేసుకోవాలి

-మానేరు ఫ్లోకు ముందే కాలువల ద్వారా చెరువులు, కుంటలను నింపాలి : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ మానేరు డ్యాం నీటిమట్టం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆ నీటిని వృథా కాకుండా సాగునీటి అవసరాలకు వినియోగించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదికల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎగువ మానేరు డ్యాంలోకి భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో, డ్యాం పూర్తిస్థాయిలో నిండిపోయి నీరు వృథాగా దిగువకు వెళ్లే పరిస్థితి రాకముందే ప్రణాళికాబద్ధంగా మానేరు కాలువలకు నీటిని విడుదల చేయాలని కోరారు. కాలువల ద్వారా నీటిని విడుదల చేసి మార్గమధ్యంలోని చెరువులు, కుంటలు, చిన్న జలాశయాలను పూర్తిస్థాయిలో నింపితే భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు సాగునీటి కొరత తీరుతుందని తెలిపారు. వర్షాకాలంలో లభించే ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవడం ప్రభుత్వంతో పాటు అధికారుల బాధ్యత అని అన్నారు.జిల్లాలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణ చేపట్టాలని, అవసరమైన ప్రాంతాలకు సాగునీటిని అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీరు వృథాగా ప్రవహించకుండా ముందస్తు ప్రణాళికతో కాలువల నిర్వహణ చేపట్టి, చెరువులు నింపడం ద్వారా భవిష్యత్తులో తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎగువ మానేరు నీటిని సమర్థవంతంగా వినియోగించడం వల్ల వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని, భూగర్భ జలమట్టం పెరగడంతో బోర్లు, బావుల్లో నీటి నిల్వలు మెరుగుపడతాయని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి విడుదలపై అధికారులు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు ఎండీ హమీద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పర్స హనుమాన్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎలక రాజు, ఓరుగంటి నరసింహులు, ఎండీ నుస్రత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్జరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మెప్మా ఇన్‌చార్జి సీఓపై సమగ్ర విచారణ జరిపించాలి

-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కమిటీ డిమాండ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05, తెలంగాణ పత్రిక



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మెప్మా (మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్)లో ఇన్‌చార్జి కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీఓ)గా పనిచేస్తున్న అధికారిపై ఫోర్జరీ సంతకాల ద్వారా కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలను వెలికి తీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం సిరిసిల్ల పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీ నాయకులు మాట్లాడుతూ, సంబంధిత అధికారిపై గతంలోనే పలు మార్లు మెప్మా ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమగ్ర విచారణ చేపట్టినట్లు కనిపించడం లేదని ఆరోపించారు. ఫిర్యాదులపై అధికారులు స్పందించకపోవడం పలు అనుమా నాలకు తావిస్తోందని అన్నారు.ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఇటువంటి ఆరోపణలపై వెంటనే స్వతంత్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విచారణలో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని కూడా వసూలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో తాజాగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్కు కూడా సీపీఎం పట్టణ కమిటీ తరపున వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి నిష్పాక్షిక విచారణకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.ప్రజాధనాన్ని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని రక్షించే ప్రయత్నాలు చేయకుండా పారదర్శకంగా విచారణ నిర్వహించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించి, బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంలో ఆలస్యం చేయకుండా పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని, లేకపోతే ప్రజాసంఘాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఎం సిరిసిల్ల పట్టణ కమిటీ హెచ్చరించింది.

# బొగ్గు నిల్వల పరీక్షలు చేపట్టిన సింగరేణి కమిటీ బృందం

రామకృష్ణాపూర్ – తెలంగాణ పత్రిక



రామకృష్ణాపూర్ కోల్ వాషరిలో సింగరేణి కార్పొరేట్ అధికారుల కమిటీ బృందం ఉన్నత స్థాయి బొగ్గు నిల్వల ధ్రువీకరణ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాషరిలో ఉన్న బొగ్గు నిల్వలు నాణ్యత ప్రమాణాలు నిర్వహణపై అధికారుల బృందం సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ స్థాయి అధికారులు జిఎం (సిపి అండ్ పి) మనోహర్, జిఎం (క్వాలిటీ) రవికుమార్, జిఎం ( సర్వే) రాఘవేందర్ రావు, జిఎం (ఎఫ్ అండ్ ఏ) చక్రవర్తి, జిఎం (క్వాలిటీ బెల్లంపల్లి రీజియన్) వీరభద్ర రావు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, ఏజీఎం ఆర్ వి ఎస్ ఆర్ కె ప్రసాద్, డీజీఎం భూక్య దేశాయ్, క్వాలిటీ డి వై ఎస్ సి ప్రదీప్ అలాగే సర్వే క్వాలిటీ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కాసుల కోసం నిబంధనలకు తూట్లు..?

**-సింహపురి కాలనీ సర్వే నెం.443లో షట్టర్ల నిర్మాణంపై అనుమానాలు..**
**-అధికారుల తీరుపై స్థానికుల ప్రశ్నలు**
**-అనుమతులు పారదర్శకంగానే ఇచ్చారా..?**
**-పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్**

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 5:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి సింహపురి కాలనీ సర్వే నంబర్ 443లో నిర్మాణంలో ఉన్న షట్టర్ల భవనం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిర్మాణం నిబంధనల మేరకు జరుగుతోందా? సంబంధిత అనుమతులు చట్టబద్ధంగా పొందారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని వారు కోరుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ఇటీవల ఈ ప్రాంతంలో వేగంగా వాణిజ్య నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ వాటిపై పర్యవేక్షణ లోపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, రహదారి వెడల్పు, పార్కింగ్, వినియోగ నిబంధనలు తదితర అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికుల ఆరోపణల ప్రకారం, కొందరు నిర్మాణదారులు తమకు అధికారుల సహకారం ఉందని చెబుతూ నిబంధనలను పట్టించు కోకుండా పనులు కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. ఈ కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, అభివృద్ధి ఛార్జీలు మరియు ఇతర ఆదాయాలకు నష్టం వాటిల్లుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న షట్టర్లకు సంబంధించిన బిల్డింగ్ పర్మిషన్, ఆమోదిత మ్యాప్, జోన్ నిబం ధనలు, రోడ్ వెడల్పు, పార్కింగ్ సౌకర్యం, వాణిజ్య వినియోగ అనుమతులు తదితర వివరాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం కొనసాగుతున్నట్లు తేలితే వెంటనే పనులు నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు ఇటీవలి కాలంలో బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్, సింహపురి కాలనీ ప్రాంతాల్లో వేగంగా జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి, అనుమతులు లేని లేదా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు అందరికీ సమానంగా అమలైతేనే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు.




**-స్థానికులు చేస్తున్న డిమాండ్**

సర్వే నెం.443లో నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులను బహిర్గతం చేయాలి.
సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలి.
నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి.
నిర్మాణ అనుమతుల ప్రక్రియలో పూర్తి పారదర్శకత తీసుకురావాలి.
అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేయాలి.

# 60 గజాల్లో ఆరు అంతస్తులా..?

**-దేవేందర్ నగర్‌లో విచ్చలవిడిగా నిర్మాణాలు.. పట్టణ ప్రణాళికకు తూట్లు..!**
**-నిబంధనల అమలుపై స్థానికుల ఆందోళన.. సమగ్ర తనిఖీలకు డిమాండ్**

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 5:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్, మహదేవపురం డివిజన్-277 పరిధిలోని దేవేందర్ నగర్‌లో వేగంగా పెరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. చిన్న విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో భారీ భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో, నిర్మాణ అనుమతులు, భవన భద్రత, పట్టణ ప్రణాళిక నిబంధనల అమలుపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.





**-చిన్న ప్లాట్లు... భారీ భవనాలు**

దేవేందర్ నగర్, రావి నారాయణరెడ్డి నగర్ (ఈస్ట్ ఫేజ్-1, ఫేజ్-2), నరసింహ బస్తీ, పోచమ్మ బస్తీ ప్రాంతాల్లో 60 నుంచి 80 గజాల ప్లాట్లలో ఐదు, ఆరు అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అనుమతించిన అంతస్తుల కంటే అధికంగా నిర్మాణాలు జరుగుతున్నాయా అనే అంశంపై అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

**-సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలా..?**

పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం ప్రతి భవనానికి చుట్టూ నిర్దిష్ట ఖాళీ స్థలం (సెట్‌బ్యాక్) ఉండాలి. అయితే కొన్ని నిర్మాణాల్లో ఆ నిబంధనలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల గాలి, వెలుతురు రాక తగ్గిపోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలు చేపట్టడం కూడా కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే కుటుంబాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడంతో వాహనాలు రోడ్లపైనే నిలిపివేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ఇరుకైన వీధులు మరింత రద్దీగా మారి రాకపోకలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంటున్నారు.

**-భూగర్భ జలాలపై ఒత్తిడి**

చిన్న స్థలాల్లో ఎక్కువ కుటుంబాలు నివసించడం వల్ల నీటి వినియోగం భారీగా పెరిగిందని స్థానికులు అంటున్నారు. ఫలితంగా కొత్త బోర్లు తవ్వడం పెరిగి భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోందని, సమీప ప్రాంతాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**-డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది**

అధిక జనసాంద్రత కారణంగా మురుగునీటి పరిమాణం పెరిగి, పాత డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యాన్ని మించిపోతుందని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగిపొర్లడం, దుర్వాసన, దోమల సమస్యలు ఎక్కువవుతున్నాయని పేర్కొంటున్నారు. నిర్మాణాల మధ్య తగినంత ఖాళీ లేకపోవడం, ఇరుకైన రహదారులు ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు లేదా అంబులెన్సులు వెళ్లడం కష్టమవుతుందని పట్టణ ప్రణాళిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచిస్తున్నారు.

**-నోటీసులకే పరిమితమా,,!!చర్యలు.. శూన్యం?**

స్థానికుల కథనం ప్రకారం, ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, వాటి అమలులో స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, నిబంధనల అమలుపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.
దేవేందర్ నగర్‌లోని అన్ని బహుళ అంతస్తుల భవనాలపై ప్రత్యేక సర్వే నిర్వహించాలి.
అనుమతులు, ఆమోదిత ప్లాన్లను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచాలి.
నిబంధనల ఉల్లంఘనలు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.
డ్రైనేజీ, పార్కింగ్, రహదారులు, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను బలోపేతం చేయాలి.
భవిష్యత్ నిర్మాణాలపై కఠిన పర్యవేక్షణ చేపట్టాలి.
ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు
దేవేందర్ నగర్‌లో జరుగుతున్న నిర్మాణాలపై జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశంపై పారదర్శక విచారణ జరిపి, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

**-బీఎస్పీ జిల్లా కార్యదర్శి చెరుకు రాజ్యం**

ముధోల్:ఆగస్టు05(తెలంగాణ పత్రిక)

నిర్మల్ జిల్లాలో యూరియా ఎరువు లను ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని దుకాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా కార్యదర్శి చెరుకు రాజ్యం పేర్కొన్నారు. బుధవారం నియోజక వర్గ కేంద్రమైన ముధోల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని, దీనిని బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంట నే సంబంధిత ఎరువుల దుకాణాల పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలన్నారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాల్లో ఎంఆర్పీ ధరల జాబితాను తప్పనిసరిగా ప్రదర్శించేల అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులకు అండగా నిలిచి నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిం చారు.




## కామారెడ్డినియోజకవర్గఅభివృద్ధికి భారీ నిధులు మంజూరు

**-ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**
**-అహర్నిశలు శ్రమించి పలు శాఖల ద్వారా కోట్లాది రూపాయల నిధుల మంజూరు..**
**-మంత్రి సీతక్క కు సన్మానం**

కామారెడ్డి, ఆగస్టు 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నిరంతరం కృషి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల మంత్రులతో సమన్వయం చేసి కోట్లాది రూపాయల అభివృద్ధి నిధులను సాధిస్తున్నారు. ఆయన నిరంతర కృషి ఫలితంగానే కామారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.75.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి.ఈ నిధులతో హమ్ ఏజెన్సీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఘనంగా సన్మానించి, కామారెడ్డి అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కామారెడ్డి నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధి కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిన రోడ్లు--భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి కూడా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఫోన్ ద్వారా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని పేర్కొన్నారు.

**ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ.**

కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం మరిన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురావడానికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. త్వరలోనే ఎఫ్‌డీఏ నిధుల కింద రూ.25 కోట్లు, మరో రూ.20 కోట్లు, అలాగే సీఆర్ఆర్ నిధుల కింద అదనంగా రూ.32 కోట్లు కూడా మంజూరు కానున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని, గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీరు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అహర్నిశలు శ్రమిస్తూ వివిధ శాఖల మంత్రులతో నిరంతరం సమన్వయం చేసి భారీ మొత్తంలో నిధులు మంజూరు చేయించడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అభినందించారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కామారెడ్డిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని షబ్బీర్ తెలిపారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు

**-టాస్క్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు-**

కామారెడ్డి ,ఆగస్టు 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఇంటర్,డిగ్రీ విద్యార్థులకు గురువారం రోజున ఉదయం 11 గంటల నుండి ప్రొఫెసర్ జయశంకర్ సార్ వారసత్వం - నేటితరం బాధ్యత అనే అంశం పైన కామారెడ్డిజిల్లా స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ సమాలోచన అధ్యయన కేంద్రం (టాస్క్) జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు.విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.మరిన్ని వివరాలకు 9492874006 నెంబర్ కు సంప్రదించాలని అన్నారు.

## షబ్బీర్ అని కలిసిన రామేశ్వర్ పల్లి కాంగ్రెస్ నాయకులు



కామారెడ్డి ,ఆగస్టు 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర రాజధానిలోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసిన భిక్నూర్ మండలం రమేశ్వర్పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు. గ్రామంలోని పలు సమస్యలపై నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీ గారితో చర్చించారు. గ్రామ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజేందర్, శశికుమార్, కొండల్ రెడ్డి, రాకేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ రెడ్డి, రమేష్ రెడ్డి, సూర్యకాంత రెడ్డి, తతిదారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ పంట కుంటలతో రైతులకు బహుళ ప్రయోజనాలు

-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి ,ఆగస్టు 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పోతాయిపల్లి ఖుర్దు గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన వ్యవసాయ పంట కుంటను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కుంట ద్వారా బహుళ ప్రయోజనాలు పొందుతున్న రైతు ప్రతాప్ రెడ్డిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ పంట కుంటల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని సంరక్షించడంతో పాటు ఎండాకాలంలో సాగునీటిగా వినియోగించుకోవచ్చని తెలిపారు. పంట కుంటల ద్వారా చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంతో పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నీటి సంరక్షణ, మచ్యా సంపద, భూగర్భ జలాల పెంపు వంటి అనేక ప్రయోజనాలతో రైతుల ఆదాయం పెరిగి సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని వివరించారు. జిల్లాలోని రైతులందరూ తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని వినియోగించుకొని తమ వ్యవసాయ భూముల్లో పంట కుంటలను నిర్మించుకుని బహుళ ప్రయోజనాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ప్రభాకర్. డి ఆర్ డి ఏ దామోదర్ రెడ్డి. ఎంపీడీవో అధికారులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణలో బూరుగుపల్లి ఆదర్శ గ్రామం

-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి ఆగస్టు 5 (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లాలో స్వచ్ఛత, పారిశుధ్యాన్ని ప్రజల భాగస్వామ్యంతో మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఇటీవల బూరుగుపల్లి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించిన సందర్భంగా ఇచ్చిన సూచనలు, ప్రోత్సాహంతో గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి వినూత్న కార్యక్రమాలను చేపట్టి శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణలో ఆదర్శంగా నిలిచారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోనే తొలిసారిగా, రాష్ట్రంలోనూ అరుదైన కార్యక్రమంగా బూరుగుపల్లి గ్రామంలోని ప్రతి ఇంటికి నాలుగు రంగుల చెత్త బుట్టలను పంపిణీ చేసి వ్యర్థాలను మూలస్థాయిలోనే వర్గీకరించే విధానాన్ని అమలు చేయడం అభినందనీయమని అన్నారు. వ్యర్థాల వర్గీకరణను ప్రతి కుటుంబం తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆకుపచ్చ రంగు బుట్టలో తడి వ్యర్థాలు, నీలం రంగు బుట్టలో పొడి వ్యర్థాలు, ఎరుపు రంగు బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నలుపు రంగు బుట్టలో ప్రమాదకర వ్యర్థాలను వేయడం ద్వారా శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా గ్రామ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి, వ్యర్థాల వర్గీకరణ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లలో తల్లిదండ్రులకు కూడా ఈ అలవాటును నేర్పించాలని సూచించారు. విద్యార్థులు సులభంగా గుర్తుంచుకునేలా అధికారులు ఈ నినాదాన్ని వివరించారు: ఆకుపచ్చ -– తడి చెత్తకునీలం -- పొడి చెత్తకుఎరుపు -- శానిటరీ చెత్తకునలుపు -- ప్రమాదకర చెత్తకు గ్రామ ప్రజలు తప్పనిసరిగా వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి గ్రామ పంచాయతీకి అందించాలని, నిబంధనలు పాటించని వారిపై గ్రామ పంచాయతీ చట్టాల ప్రకారం చర్యలు, జరిమానాలు విధించబడతాయని అధికారులు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీఓ, ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సూచనలు, ప్రోత్సాహంతో గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం బూరుగుపల్లిని శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగుగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలందరూ భాగస్వాములై గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# వర్షాల అనంతరం అంటువ్యాధుల నివారణకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి ,ఆగస్టు 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో నీటి కలుషితం, చెత్త పేరుకుపోవడం, నిల్వ నీరు ఏర్పడటం, దోమల వ్యాప్తి వంటి కారణాలతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఈ క్రింది జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసిన తర్వాత మాత్రమే తాగాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలి.కాలువలు, డ్రైనేజీలు మూసుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. నిల్వ నీరు లేకుండా చూసుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలి. తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహారాన్ని వీలైనంత వరకు నివారించాలి. సబ్బుతో తరచూ చేతులు కడుక్కోవడం అలవాటు చేసుకోవాలి. తడి దుస్తులను వెంటనే మార్చుకొని శరీరాన్ని పొడిగా ఉంచుకోవాలి. జ్వరం, విరేచనాలు, వాంతులు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్యుడిని సంప్రదించాలి. పాఠశాలలు, కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పరిశుభ్రత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, ప్రజలు కూడా వాటిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడితే అంటువ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చు. మీ ఆరోగ్యం -– మీ కుటుంబ ఆరోగ్యం -- మన జిల్లా ఆరోగ్యం. అందరం కలిసి పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన కామారెడ్డి జిల్లాను నిర్మిద్దాం." అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వరి ఎదుగుదల నిలిచిపోవడంతో రైతుల్లో ఆందోళన







-సిద్ధన్నపేటలో వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

-అవసరమైన చర్యల కోసం శాస్త్రవేత్తలకు నమూనాలను పంపిన అధికారులు

నంగునూరు, ఆగస్టు 5(తెలంగాణ పత్రిక);

సమయానికి నారు పోసి, నాట్లు వేసినప్పటికీ వరి పంట ఆశించిన స్థాయిలో ఎదగకపోవడం, పైగా ఆకులపై పురుగు ఉధృతి కనిపించడంతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మండల వ్యవసాయ అధికారి బి. గీత, వ్యవసాయ విస్తరణ అధికారి సాయివర్మ బుధవారం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు గజ్జెల మధుసూదన్ రెడ్డి పొలంలో వరి పంటను నిశితంగా పరిశీలించిన అధికారులు, నారు నాటి రెండు నెలలు గడిచినా, నాట్లు వేసి నెల రోజులు దాటినా మొక్కలు తగిన ఎదుగుదల కనబరచకపోవడాన్ని గమనించారు. కొన్ని చోట్ల మొక్కలు పసుపు రంగులోకి మారడం, ఎదుగుదల మందగించడం, పురుగు దాడి లక్షణాలు కనిపించడం వల్ల సమస్య తీవ్రతను అంచనా వేశారు. పంటలో కనిపించిన పురుగు నమూనాలతో పాటు వరి కర్రలను సేకరించి, ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలకు పంపించారు. శాస్త్రవేత్తల నివేదిక వచ్చిన అనంతరం రైతులకు తగిన సాంకేతిక సూచనలు, నివారణ చర్యలు తెలియజేస్తామని అధికారులు వెల్లడించారు. వ్యవసాయాధికారులు రైతులతో మాట్లాడి, ప్రస్తుతం ఎలాంటి పురుగుమందులను స్వయంగా పిచికారీ చేయవద్దని, శాస్త్రీయ నివేదిక వచ్చే వరకు వేచి ఉండాలని సూచించారు. పొలాల్లో నీటి మట్టాన్ని నియంత్రించడం, ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించడం, పురుగు ఉధృతిని నిరంతరం గమనిస్తూ వెంటనే వ్యవసాయ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

**రైతుల్లో ఆందోళన**

ఈ ఏడాది ఖరీఫ్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు వరి ఎదుగుదల మందగించడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే నారు, నాట్లు, ఎరువులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయని, ఇప్పుడు పంట ఎదగకపోతే పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపించి పంటను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**శాస్త్రీయ పరీక్షలతోనే అసలు కారణం వెలుగులోకి**

వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం వరి ఎదుగుదల మందగించడానికి అనేక కారణాలు ఉండే అవకాశం ఉంది. వైరస్ లేదా ఫంగస్ వ్యాధులు, నేలలో పోషక లోపాలు, వేర్లకు సంబంధించిన సమస్యలు, నీటి నిర్వహణలో లోపాలు లేదా సూక్ష్మపోషకాల కొరత వంటి అంశాలు కూడా ఇందుకు కారణమై ఉండవచ్చు. అందుకే క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి నివేదిక ఆధారంగా నివారణ చర్యలు చేపట్టడం అత్యంత అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిశీలనలో గ్రామ సర్పంచ్ సంగు పురేందర్, రైతులు కత్తుల రాజిరెడ్డి, వంగర మల్లారెడ్డి, పులగూర్లల మహేందర్ రెడ్డి, గజ్జెల మధుసూదన్ రెడ్డి, గజ్జెల తిరుపతి రెడ్డి, కారంపురి మల్లేశం తదితరులు పాల్గొని రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను సకాలంలో అందించాలి

-- కామారెడ్డిజిల్లా కలెక్టర్

కామారెడ్డి ,ఆగస్టు 5, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లాలోని ప్రభుత్వ, సంక్షేమ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను సకాలంలో కుట్టించి పాఠశాలల వారీగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలో యూనిఫాంల కటింగ్ మరియు స్టిచింగ్,పై గాంధారి మండలంలోని యూనిఫాం కటింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ మహిళా టైలర్లతో నేరుగా మాట్లాడి, యూనిఫాంల కటింగ్ ప్రక్రియ, పనిలో ఎదురవుతున్న ఇబ్బందులు, వస్త్రాల లభ్యత, కొలతల ప్రకారం కటింగ్, రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా టైలర్లను అభినందిస్తూ, వారి ద్వారా నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా ప్రతి విద్యార్థికి సరైన కొలతలతో యూనిఫాంలను కుట్టించి, నిర్ణీత గడువులోగా పాఠశాలల వారీగా పంపిణీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహిళా టైలర్లకు ఉపాధి కల్పిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో యూనిఫాంల పంపిణీ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో యూనిఫాంల మొదటి జత పంపిణీ పూర్తయినందుకు సంబంధిత అధికారులను అభినందించారు. మిగిలిన ప్రభుత్వ, సంక్షేమ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న యూనిఫాంల స్టిచింగ్ పంపిణీని వేగవంతం చేసి ప్రతి విద్యార్థికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 959 విద్యాసంస్థలు/పాఠశాలలు, హాస్టళ్లలో 89,279 మంది విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన యూనిఫాంలు అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ఎలాంటి జాప్యం లేకుండా పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్,ఎల్లారెడ్డి రెవిన్యూ డివిజనల్ అధికారి, డీపీఎం, ఏటీఎం, తాసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓవివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యాశాఖ, సంక్షేమ శాఖలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143